
డైనమిక్
# జనం వాయిస్
RNI NO: TGTEL/26/A0383
తెలుగు దినపత్రిక
DYNAMIC JANAMVOICE
WWW.JANAMVOICE.COM
TG - AP HYDERABAD RANGAREDDY KARIMNAGAR KHAMMAM WARANGAL ADILABAD NIZAMABAD NALGONDA MEDAK MAHABOOBNAGAR







| తెలంగాణ Telangana | శనివారం Saturday | 23 - 05 -2026 23- 05 -2026 | సంపుటి: 01 Volume: 01 | సంచిక: 128 Issue: 128 | పేజీలు: 12 Pages: 12 | వెల: 02/- Cost :02/- |
|---|---|---|---|---|---|---|

## మహారాష్ట్రలో పులి బీభత్సం

అడవికి వెళ్లిన నలుగురు మహిళల మృతి.
ఆకులు ఏరుకుంటుండగా దాడి చేసిన పులి.
గ్రామాల్లో భయాందోళనలు.



**జనం వాయిస్, ముంబయి, మే 22:**
మహారాష్ట్రలోని చంద్రపుర్ జిల్లాలో విషాద ఘటన చోటుచేసుకుంది. అడవికి వెళ్లిన నలుగురు మహిళలపై పులి దాడి చేసి ప్రాణాలు తీసింది. శుక్రవారం ఉదయం గంజేవాహి అటవీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. చుట్టుపక్క గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. సిందేవహి తాలూకా పరిధిలోని గ్రామాలకు చెందిన మహిళలు ప్రతిరోజూ ఉదయం అడవికి వెళ్లి ఎండిపోయిన బీడీ ఆకులు ఏరుకుని జీవనం సాగిస్తుంటారు. ఇదే క్రమంలో శుక్రవారం ఉదయం కూడా కొందరు మహిళలు గంజేవాహి అడవిలోకి వెళ్లారు. ఉదయం 8 గంటల సమయంలో వారు ఆకులు

- మిగతా 2 లో...


2

## సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టులో పిటిషన్

విద్యార్థులపై అదనపు భారం అంటూ అభ్యంతరాలు.
వచ్చే వారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు వెల్లడి.
జులై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం.

## దాహంతో బస్సు ఆపిన కోతి

విదర్భ ఎండల్లో వన్యప్రాణుల అవస్థలు.
ప్రయాణికులు ఇచ్చిన నీటితో దాహం తీర్చుకున్న కోతులు.
వైరల్‌గా మారిన హృదయ విదారక దృశ్యాలు.



**జనం వాయిస్, ముంబయి, మే 22:**
మహారాష్ట్రలోని విదర్భ ప్రాంతంలో మండుతున్న ఎండలు వన్యప్రాణులపై ఎంతటి తీవ్ర ప్రభావం చూపుతున్నాయో తెలియజేసే హృదయ విదారక ఘటన యవత్మాల్ జిల్లాలో చోటుచేసుకుంది. పుసద్ సమీపంలోని ఖండాలా ఘాట్ అటవీ ప్రాంతంలో తీవ్ర దాహంతో అలమటించిన ఓ కోతి రోడ్డుపైకి వచ్చి ప్రభుత్వ బస్సును

- మిగతా 2 లో...

## రైతుల సమస్యలపై కవిత ఆగ్రహం

సెక్రటేరియట్ ముందు వడ్లు పోసి నిరసన.
కొనుగోళ్లలో ఆలస్యంపై ప్రభుత్వానికి హెచ్చరిక.
రైతులను మోసం చేస్తున్నారంటూ విమర్శలు.




**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల గోస పట్టని ప్రభుత్వానికి బుద్ధి రావాలనే ఉద్దేశంతో సెక్రటేరియట్ ముందు నిరసన చేపట్టినట్లు తెలిపారు. తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో వడ్లు పోసి నిరసన తెలియజేసినట్లు వెల్లడించారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను కొనుగోలు చేసి వారికి అండగా నిలవాలనే బాధ్యత కూడా రాష్ట్ర ప్రభుత్వానికి లేకపోయిందని మండిపడ్డారు. మండుతున్న ఎండల కారణంగా రైతులు వడదెబ్బకు గురై కల్లాల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు అకాల వర్షాలతో తడిసిన ధాన్యం, మక్కలు,

- మిగతా 2 లో...

## 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

దేశ సగటును మించిన తెలంగాణ వృద్ధిరేటు.
మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.
బ్యాంకులు రాష్ట్ర అభివృద్ధి భాగస్వాములుగా మారాలని పిలుపు.
ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క.







**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
తెలంగాణను 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మహాత్మా జ్యోతిరావు పూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 49వ రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న ఆయన రాష్ట్ర అభివృద్ధి దిశగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. సంక్షేమ పథకాలు, మహిళా సాధికారత, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, మూసీ పునరుజ్జీవనం, గ్రామీణాభివృద్ధి వంటి అంశాలపై ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, ఆర్బీఐ ప్రాంతీయ డైరెక్టర్ చిన్మయ్ మోహన్, ఎస్బీఐ సీఎంజీఎం నీలేష్ ద్వివేది తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర

- మిగతా 2 లో...

## భద్రాద్రిలో 385 కేజీల గంజాయి పట్టివేత

- వాహన తనిఖీల్లో భారీగా గంజాయి స్వాధీనం.
- రెండు కార్లు, ఒక లారీ సీజ్ చేసిన పోలీసులు.
- ఆరుగురు నిందితుల అరెస్ట్.


02

## లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి

- రూ.25 వేల లంచం స్వీకరిస్తుండగా పట్టివేత.
- మెదక్ జిల్లా నర్సాపూర్‌లో ఏసీబీ దాడి.


02




## పోక్సో కేసులో ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

- నిందితుడిని తొమ్మిది రోజుల పాటు కాపాడారని ఆరోపణలు.
- ఆడబిడ్డకు న్యాయం జరగలేదని మండిపాటు.


02

## డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

- భారీ ఆస్తుల కేసులో ఏసీబీ దాడులు.
- 11 ప్రాంతాల్లో సోదాలు.. కోట్ల విలువైన ఆస్తుల గుర్తింపు.

2





## ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్య హత్య

ఉరివేసుకున్నట్లు చిత్రీకరించిన భర్త.
ఖమ్మం జిల్లాలో కలకలం రేపిన ఘటన.
హత్య కోణంలో పోలీసుల విచారణ.


02

- మొదటిపేజీ తరువాయి... ఏరుకుంటుండగా పులి ఒక్కసారిగా వారిపై దాడి చేసినట్లు సమాచారం. ప్రత్యక్ష సాక్షుల వివరాల ప్రకారం మహిళలు అప్రమత్తం అయ్యేలోపే పులి వారిపై విరుచుకుపడింది. తప్పించుకునే అవకాశం కూడా లేకుండా క్షణాల్లోనే దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది. ఈ ఘటనలో నలుగురు మహిళలు అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. ఘటన సమాచారం అందుకున్న వెంటనే అటవీశాఖ అధికారులు ప్రాంతానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి అంజలీ సాయంకర్ తన సిబ్బందితో కలిసి సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఒకేసారి నలుగురు మహిళలు పులి దాడిలో ప్రాణాలు కోల్పోవడంతో స్థానిక గ్రామాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అటవీశాఖ నిర్లక్ష్యమే ఈ ఘటనకు కారణమని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. పులిని వెంటనే బంధించి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు అడవిలో గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు తెలిపారు.



# సీబీఎస్ఈ త్రిభాషా విధానంపై సుప్రీంకోర్టులో పిటిషన్

**జనం వాయిస్, న్యూఢిల్లీ, మే 22:**
సీబీఎస్ఈ అనుబంధ విద్యాసంస్థల్లో త్రిభాషా విధానాన్ని తప్పనిసరి చేస్తూ తీసుకున్న నిర్ణయం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఈ విద్యా సంవత్సరంలో తొమ్మిదో తరగతి నుంచే త్రిభాషా విధానాన్ని అమలు చేయాలని సీబీఎస్ఈ నిర్ణయించగా, దీనిని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ప్రముఖ సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. త్రిభాషా విధానం అమలుతో విద్యార్థులపై అదనపు ఒత్తిడి పడే అవకాశముందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఇప్పటికే పాఠ్యభారం ఎక్కువగా ఉన్న సమయంలో ఒక్కసారిగా మూడు భాషలు నేర్చుకోవడం విద్యార్థులకు కష్టమవుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా పదో తరగతి బోర్డు పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులపై ఈ ప్రభావం మరింత ఎక్కువగా ఉంటుందని వాదించారు. ఈ అంశంపై స్పందించిన సుప్రీంకోర్టు కేసును వచ్చే వారం విచారణకు తీసుకుంటామని తెలిపింది. సీబీఎస్ఈ ఇటీవలే త్రిభాషా విధానంపై అధికారిక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ జూలై 1 నుంచి మూడో భాష బోధన ప్రారంభం కానుంది. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ2020, నేషనల్ కరిక్యులమ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ స్కూల్ ఎడ్యుకేషన్2022 ప్రకారం ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. ఆర్1, ఆర్2, ఆర్3 విధానాల కింద త్రిభాషా బోధన కొనసాగుతుంది. మూడు భాషల్లో కనీసం రెండు భారతీయ భాషలు తప్పనిసరిగా ఉండాలని సీబీఎస్ఈ స్పష్టం చేసింది. మూడో భాషగా మరో భారతీయ భాషను లేదా విదేశీ భాషను ఎంపిక చేసుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు. త్రిభాషా విధానం కోసం సీబీఎస్ఈ మొత్తం 42 భాషలను ఎంపిక చేసి వాటికి సంబంధించిన సిలబస్ రూపొందించింది. రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో పొందుపర్చిన భాషలను విద్యార్థులు ఎంపిక చేసుకోవచ్చు. వచ్చే ఏడాది పదో తరగతిలో కూడా త్రిభాషా విధానం అమల్లోకి రానున్నప్పటికీ, దీనికి ప్రత్యేక బోర్డు పరీక్ష నిర్వహించబోమని సీబీఎస్ఈ వెల్లడించింది. మూడో భాషకు సంబంధించిన మార్కులను అంతర్గత మూల్యాంకనం ఆధారంగా తుది ఫలితాల్లో కలుపుతామని బోర్డు తెలిపింది.

# దాహంతో బస్సు ఆపిన కోతి

- మొదటిపేజీ తరువాయి... ఆపి నీళ్లు అడిగిన ఘటన అందరినీ కదిలించింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో వాషిం నుంచి పుసద్ వెళ్తున్న మహారాష్ట్ర రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సు ఖండాలా ఘాట్ అటవీ ప్రాంతానికి చేరుకుంది. అదే సమయంలో ఒక్కసారిగా ఓ కోతి రోడ్డుపైకి వచ్చి బస్సుకు అడ్డంగా నిలబడింది. ప్రమాదం జరుగుతుందేమోనని భావించిన డ్రైవర్ వెంటనే బస్సును ఆపేశారు. మొదట డ్రైవర్‌తో పాటు ప్రయాణికులు కూడా కోతిని అక్కడి నుంచి తరిమేందుకు ప్రయత్నించారు. అయితే ఆ కోతి కదలకుండా అక్కడే ఉండిపోయింది. తీవ్రమైన ఎండల కారణంగా అది దాహంతో, నీరసంతో అల్లాడుతోందని ప్రయాణికులు గుర్తించారు. వెంటనే కొందరు తమ వద్ద ఉన్న నీటి బాటిళ్లను తీసి కోతికి అందించారు. దాంతో ఆ కోతి ఆత్రంగా నీళ్లు తాగడం ప్రారంభించింది. ఈ దృశ్యం చూసిన ప్రయాణికులు భావోద్వేగానికి గురయ్యారు. ఆ కోతి నీళ్లు తాగుతుండగానే సమీపంలోని అడవి నుంచి మరికొన్ని కోతులు అక్కడికి చేరుకున్నాయి. ఒక్కో కోతి దాహం తీర్చుకునేందుకు ఆత్రంగా ముందుకు రావడంతో ప్రయాణికులు తమ వద్ద ఉన్న నీటిని వాటికీ పంచిపెట్టారు. వేడిమి తీవ్రతకు వన్యప్రాణులు ఎలా ఇబ్బందులు పడుతున్నాయో ప్రత్యక్షంగా చూసి చాలామంది చలించిపోయారు. ఈ ఘటనను బస్సులో ప్రయాణిస్తున్న లతా శ్రీవాస్ అనే మహిళ తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వేగంగా వైరల్ అవుతున్నాయి. మండుతున్న ఎండలు, నీటి కొరత వలన అడవి జంతువులు కూడా రోడ్లపైకి వస్తున్నాయంటూ నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతిని కాపాడకపోతే భవిష్యత్తులో పరిస్థితులు మరింత విషమిస్తాయని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కోతులు నీటి కోసం బస్సులను ఆపే పరిస్థితి రావడం హృదయాన్ని మెలిపెడుతోందని పోస్టులు పెడుతున్నారు. ఈ ఘటనతో విదర్భ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణపై మరోసారి చర్చ మొదలైంది. వేసవిలో అటవీ శాఖ జంతువుల కోసం కృత్రిమ నీటి తొట్టెలు ఏర్పాటు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, ఖండాలా ఘాట్ వంటి ప్రాంతాల్లో సరైన సదుపాయాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి. అడవి జంతువులు దాహంతో రోడ్లపైకి రావడం అటవీశాఖ వైఫల్యానికి నిదర్శనమని స్థానికులు ఆరోపిస్తున్నారు. వన్యప్రాణుల కోసం మరిన్ని నీటి వనరులు ఏర్పాటు చేయాలని పర్యావరణవేత్తలు డిమాండ్ చేస్తున్నారు.

# రైతుల సమస్యలపై కవిత ఆగ్రహం

- మొదటిపేజీ తరువాయి... పొద్దుతిరుగుడు పువ్వు, జొన్నలను రైతులు ఆరబెడుతూ కొనుగోలు కోసం ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంటా వేసే సిబ్బంది లేక రైతులు రోజుల తరబడి ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో తూకాల్లో తరుగు తీస్తున్నారని, తేమ పేరుతో కొనుగోళ్లను ఉద్దేశపూర్వకంగా ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బి గ్రేడ్‌గా చూపిస్తూ మిల్లర్లు రైతులను మోసం చేస్తున్నారని, ఈ వ్యవహారాలను పర్యవేక్షించే అధికారులు కూడా పట్టించుకోవడం లేదని అన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రెండున్నరేళ్లుగా వ్యవసాయ శాఖపై సమీక్ష నిర్వహించని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రాష్ట్రానికి పట్టిన దరిద్రమని కవిత తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పండిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రక్షణ సేన తరఫున డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. ఇవాళ సెక్రటేరియట్ ముందు చేపట్టిన నిరసన కేవలం శాంపిల్ మాత్రమేనని కవిత హెచ్చరించారు. వానలు పడేలోపు కొనుగోళ్ల ప్రక్రియను పూర్తి చేయకపోతే తెలంగాణ రక్షణ సేన మరింత తీవ్రంగా ఉద్యమంలోకి దిగుతుందని స్పష్టం చేశారు. రైతులను ఇబ్బంది పెట్టే పరిస్థితులు కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా రైతుల సమస్యలను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని కవిత డిమాండ్ చేశారు. కొనుగోళ్లలో పారదర్శకత తీసుకురావాలని, మిల్లర్ల అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు. రైతులకు న్యాయం జరగకపోతే మంత్రులు, ఎమ్మెల్యేలు తెలంగాణలో తిరగలేని పరిస్థితి వస్తుందని హెచ్చరిస్తూ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని సూచించారు.

# 3 ట్రిలియన్ ఆర్థిక వ్యవస్థ లక్ష్యం

- మొదటిపేజీ తరువాయి... అభివృద్ధిలో బ్యాంకుల పాత్ర కీలకమని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. బ్యాంకులు కేవలం డిపాజిట్లు స్వీకరించే, రుణాలు ఇచ్చే సంస్థలుగానే కాకుండా రాష్ట్ర వ్యూహాత్మక అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించాలని సూచించారు. ప్రస్తుతం దేశ సగటు వృద్ధిరేటు 8.2 శాతంగా ఉండగా తెలంగాణ 10.7 శాతం వృద్ధిరేటుతో ముందంజలో ఉందని భట్టి విక్రమార్క తెలిపారు. దేశ తలసరి ఆదాయం రూ.2.1 లక్షలు మాత్రమే ఉండగా తెలంగాణ తలసరి ఆదాయం రూ.4.18 లక్షలతో అగ్రస్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో బ్యాంకుల మొత్తం డిపాజిట్లు రూ.9.43 లక్షల కోట్లకు, అడ్వాన్సులు రూ.12.34 లక్షల కోట్లకు చేరుకోవడం విశేషమన్నారు. 130.78 శాతం క్రెడిట్-డిపాజిట్ నిష్పత్తితో తెలంగాణ దేశంలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందని పేర్కొన్నారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. రైతులు, పాడి రైతులు, మత్స్యకారులు, అనుబంధ రంగాలకు బ్యాంకులు మరింత సహకారం అందించాలని కోరారు. వ్యవసాయ రుణాల పంపిణీలో బ్యాంకులు లక్ష్యాలను మించి పనిచేయడం అభినందనీయమన్నారు. రూ.1,65,297 కోట్ల లక్ష్యానికి గాను రూ.1,68,401 కోట్ల వ్యవసాయ రుణాలు పంపిణీ చేయడం రాష్ట్ర బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యానికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థులకు ఇచ్చే



విద్యారుణాలు భవిష్యత్తుపై పెట్టుబడులని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. యువతకు సానుకూల దృక్పథంతో రుణాలు అందించాలని బ్యాంకులకు సూచించారు. సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమలు, మహిళా పారిశ్రామికవేత్తలు, దళితులు, గిరిజన యువతకు మరింత రుణ సహాయం అందించాలని కోరారు. తెలంగాణ పారిశ్రామిక రంగంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఒకటిగా నిలుస్తోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పునరుత్పాదక ఇంధన రంగానికి ప్రాధాన్యం పెరుగుతోందని, తెలంగాణ కూడా సౌరశక్తి రంగంలో వేగంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రూఫ్‌టాప్ సోలార్ ప్యానెల్స్, పర్యావరణహిత ప్రాజెక్టులకు బ్యాంకులు చురుకుగా రుణాలు ఇవ్వాలని సూచించారు. మూసీ నది పునరుజ్జీవనం, ఫ్యూచర్ సిటీ నిర్మాణం, రీజినల్ రింగ్ రోడ్ పనులు ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలుగా కొనసాగుతున్నాయని వివరించారు. తెలంగాణలో వేగంగా పట్టణీకరణ జరుగుతోందని, దీని వల్ల సేవల రంగానికి భారీ అవకాశాలు ఉన్నాయని అన్నారు. మహిళా ఆర్థిక సాధికారత కోసం స్వయం సహాయక సంఘాలకు ఇచ్చే వడ్డీలేని రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతున్నట్లు ఉప ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్ నగరంలో మహిళా సంఘాలకు రుణాల పంపిణీని యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. నగరంలోని మురికివాడల మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు. మహిళలు వ్యాపార, చిన్నతరహా పరిశ్రమల్లో ముందుకు రావాలని ప్రభుత్వం కోరుకుంటోందన్నారు. త్వరలో రాష్ట్రంలో అనేక ఇండస్ట్రియల్ హబ్‌లు, క్లస్టర్లు ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. ఫార్మా, ఫ్యాబ్ సిటీ, స్టీల్, లెదర్, టెక్స్‌టైల్ రంగాల్లో ప్రత్యేక పారిశ్రామిక మండలాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమాంతరంగా తీసుకెళ్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్ట్

**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
మేడ్చల్‌మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు అరెస్టు చేశారు. అక్రమ ఆస్తుల కేసులో భాగంగా శుక్రవారం ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మొత్తం 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు విస్తృత సోదాలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో కూడా తనిఖీలు చేపట్టగా భారీ స్థాయిలో ఆస్తులు వెలుగులోకి వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఏసీబీ దర్యాప్తులో వంశీమోహన్‌కు చెందిన కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించినట్లు సమాచారం. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లను అధికారులు గుర్తించారు. అదనంగా రూ.1.2 కోట్ల విలువైన మూడు ఇళ్లు కూడా ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది. ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద రెండు ఎకరాల్లో నిర్మించిన ఫామ్ హౌస్ కూడా వంశీమోహన్‌కు చెందినదిగా ఏసీబీ అధికారులు గుర్తించారు. గతంలో శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో ఆర్డీవోగా పనిచేసిన సమయంలో ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయని అధికారులు తెలిపారు. అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురం ప్రాంతాల్లో సుమారు ఎనిమిది ఎకరాల భూమిని ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. ఈ భూములను మొదట తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి, అనంతరం రియల్టర్లకు బదిలీ చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ వ్యవహారంలో పలు ఆర్థిక లావాదేవీలను కూడా అధికారులు పరిశీలిస్తున్నారు. దర్యాప్తులో భాగంగా ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ రూపంలో తీసుకున్నట్లు ఏసీబీ గుర్తించింది. ప్రభుత్వ పదవిని దుర్వినియోగం చేసి అక్రమంగా ఆస్తులు కూడబెట్టినట్లు ప్రాథమిక ఆధారాలు లభించడంతో వంశీమోహన్‌ను అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న పత్రాలు, ఆస్తుల విలువ, ఆర్థిక లావాదేవీలపై మరింత లోతైన దర్యాప్తు కొనసాగుతోందని ఏసీబీ వెల్లడించింది. అక్రమ ఆస్తుల మొత్తం విలువ ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కేసుకు సంబంధించి మరికొంతమందిపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ అధికారి

**జనం వాయిస్, మెదక్, మే 22:**
మెదక్ జిల్లా నర్సాపూర్ విద్యుత్ విభాగంలో పనిచేస్తున్న అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు చిక్కాడు. నర్సాపూర్ ఆపరేషన్స్ విభాగానికి చెందిన ఏడీఈ ముద్దం రమణారెడ్డి అధికారిక పనికి సంబంధించి రూ.25 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం, ఫిర్యాదుదారునికి సంబంధించిన 11 వర్క్ బిల్లులను మెదక్ డివిజనల్ ఇంజినీర్ కార్యాలయానికి ఫార్వర్డ్ చేయడానికి ముద్దం రమణారెడ్డి లంచం కోరినట్లు తెలిసింది. మొత్తం రూ.3,13,882 విలువైన బిల్లులను ముందుకు పంపేందుకు రూ.25 వేల రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు ప్రత్యేకంగా ఉచ్చుపన్ని శుక్రవారం మధ్యాహ్నం నర్సాపూర్ కార్యాలయంలో దాడి నిర్వహించారు. లంచం మొత్తాన్ని స్వీకరిస్తున్న సమయంలోనే అధికారిని అదుపులోకి తీసుకున్నారు. ఆయన వద్ద నుంచి రూ.25 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ ఉద్యోగిగా ప్రజా విధులను నిజాయితీగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ, అక్రమ లాభం కోసం అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని ఏసీబీ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి హైదరాబాద్‌లోని ప్రత్యేక ఏసీబీ కోర్టులో హాజరుపరచనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం కేసు దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుని వివరాలను భద్రతా కారణాల రీత్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 1064కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరింది. వాట్సాప్, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు వెల్లడించింది. రాష్ట్రంలో అవినీతికి అడ్డుకట్ట వేయడానికి ఏసీబీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పోక్సో కేసులో ప్రభుత్వ వైఖరిపై కేటీఆర్ తీవ్ర విమర్శలు

**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
పోక్సో కేసులో నిందితుడిని తొమ్మిది రోజుల పాటు దాచి ఉంచిన బాధ్యత పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానిదేనని కల్వకుంట్ల తారక రామారావు తీవ్ర ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మధ్య ఉన్న అనుబంధం వల్లే బాధిత బాలికకు అన్యాయం జరిగిందని విమర్శించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన, ఈ వ్యవహారంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనర్ బాలిక తనకు అన్యాయం జరిగిందని కుటుంబ సభ్యులతో కలిసి పోలీస్ స్టేషన్‌కు వెళ్తే అర్ధరాత్రి వరకు నిలబెట్టి వేధించారని కేటీఆర్ ఆరోపించారు. నిందితుడిని అరెస్ట్ చేయకుండా తొమ్మిది రోజుల పాటు కాపాడింది రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా మహిళలు తీవ్రంగా స్పందించడంతోనే చివరికి ప్రభుత్వం దిక్కుతోచని పరిస్థితుల్లో అరెస్ట్ చేసిందని పేర్కొన్నారు. హైకోర్టు బెయిల్ ఇవ్వబోదని స్పష్టం చేసిన తర్వాతే చర్యలు తీసుకున్నారని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రధానమంత్రి పర్యటన కారణంగా పోలీసులు బిజీగా ఉన్నారని ప్రభుత్వం చెప్పడం సిగ్గుచేటని విమర్శించారు. “ప్రధానమంత్రి వస్తే మూడు రోజుల పాటు నేరస్థులు స్వేచ్ఛగా తిరగాలా?” అని ప్రశ్నించారు. రాష్ట్ర




హోంశాఖకు బాధ్యుడైన ముఖ్యమంత్రి ఇలాంటి సాకులు చెప్పడం బాధాకరమన్నారు. పోక్సో కేసు వంటి సున్నితమైన అంశంపై తాము ఇప్పటి వరకు రాజకీయాలు చేయలేదని కేటీఆర్ తెలిపారు. కానీ ముఖ్యమంత్రి తమపై విమర్శలు చేయడంతో స్పందించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. దేశంలో ఎక్కడైనా పోక్సో కేసు నిందితుడు తొమ్మిది రోజుల పాటు తప్పించుకొని తిరిగిన ఉదాహరణ ఉందా అని ప్రశ్నించారు. కేవలం అధికార అండదండల వల్లే నిందితుడు తప్పించుకున్నాడని ఆరోపించారు. బాధిత కుటుంబంపై ‘హనీ ట్రాప్’ పేరుతో కౌంటర్ కేసులు పెట్టడం వెనుక ఎవరు ఉన్నారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి సన్నిహితుల ఆసుపత్రిలో నిందితుడిని దాచిపెట్టారనే వార్తలపై విచారణ జరపాలని కోరారు. ఒకవైపు తన కుమారుడికి సంబంధం లేదని కోర్టులో చెప్పి, మరోవైపు తానే పోలీసులకు అప్పగించానని చెప్పడం ఎలా సాధ్యమో బండి సంజయ్ సమాధానం చెప్పాలని అన్నారు. ఈ వ్యవహారంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ప్రభుత్వాన్ని, మీడియాను అప్రమత్తం చేస్తూ ముందుకు వెళ్లారని కేటీఆర్ ప్రశంసించారు. ఆయనపై ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రాష్ట్రంలో ఆడబిడ్డలకు అన్యాయం జరిగిన ప్రతిసారి తామే పోరాడామని, భవిష్యత్తులో కూడా బాధితులకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. ఈ మొత్తం వ్యవహారంలో మీడియా పాత్రపైనా కేటీఆర్ ప్రశ్నలు లేవనెత్తారు. “హనీ ట్రాప్” అంటూ వార్తలు రాయించిన వ్యక్తులు ఎవరో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి మీడియా సంస్థలకు ఫోన్ చేసి వార్తలు ఆపించారని వస్తున్న ఆరోపణలపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. నేరస్థుడు ఎవడైనా నేరస్థుడేనని, అధికారంలో ఉన్నవారికి ప్రత్యేక రక్షణ ఉండకూడదని కేటీఆర్ స్పష్టం చేశారు.


# భద్రాద్రిలో 385 కేజీల గంజాయి పట్టివేత

**జనం వాయిస్, భద్రాద్రి కొత్తగూడెం, మే 22:**
గంజాయి అక్రమ రవాణాపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లాలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో భారీ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 385 కిలోల గంజాయిని పట్టుకుని అక్రమ రవాణాకు ఉపయోగించిన రెండు కార్లు, ఒక లారీని పోలీసులు సీజ్ చేశారు. ఈ కేసులో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకుని వారిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. అక్రమంగా గంజాయి తరలిస్తున్నారనే సమాచారంతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. అనుమానాస్పద వాహనాలను ఆపి తనిఖీ చేయగా భారీగా గంజాయి బయటపడినట్లు పేర్కొన్నారు. గంజాయి రవాణా వెనుక ఉన్న ముఠాలపై కూడా పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాను కేంద్రంగా చేసుకుని ఇతర ప్రాంతాలకు మత్తు పదార్థాలు తరలిస్తున్న నెట్వర్క్‌పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్నామని వెల్లడించారు. అక్రమ మత్తు పదార్థాల నియంత్రణకు జిల్లా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారని పేర్కొన్నారు. యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని తెలిపారు. గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహన తనిఖీలను జిల్లావ్యాప్తంగా మరింత విస్తరించనున్నట్లు పోలీసులు తెలిపారు. సరిహద్దు ప్రాంతాలు, ప్రధాన రహదారులపై నిరంతర నిఘా కొనసాగుతోందన్నారు. అనుమానాస్పద కదలికలపై ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో అవసరమని జిల్లా పోలీసులు పేర్కొన్నారు. గంజాయి అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు ప్రత్యేక బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. నేరాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని స్పష్టం చేశారు.




# ఇన్సూరెన్స్ డబ్బుల కోసం భార్య హత్య

**జనం వాయిస్, ఖమ్మం, మే 22:**
ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం గోల్ తండాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. ఇన్సూరెన్స్ డబ్బుల కోసం ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్యను భర్తే హత్య చేశాడని మృతురాలి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. హత్య అనంతరం ఆమె ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు చిత్రీకరించి నిందితుడు పరారైనట్లు సమాచారం. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మృతురాలు మీనాక్షి, భర్త శివాజీ 14 సంవత్సరాల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. తిరుమలాయపాలెం మండలం పాతర్లపాడు స్టేజ్ సమీపంలోని గోల్ తండాలో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నారు. బయటకు సాధారణ కుటుంబంలా కనిపించినా, ఇంట్లో తరచూ గొడవలు జరిగేవని బంధువులు చెబుతున్నారు. ఇటీవల ఇంటిపై సుమారు రూ.80 లక్షల రుణభారం ఉందని, మీనాక్షి పేరుపై కోటి రూపాయల ఇన్సూరెన్స్ పాలసీ ఉండటంతో డబ్బుల కోసం ఈ హత్య జరిగి ఉండొచ్చని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇన్సూరెన్స్ క్లెయిమ్ కోసం భార్యను చిత్రహింసలకు గురిచేసి చివరకు హత్య చేశాడని ఆరోపిస్తున్నారు. గతంలో కూడా శివాజీ తన భార్యపై దాడి చేసిన ఘటనలు ఉన్నాయని చెబుతున్నారు. మీనాక్షిని కిందపడేసి పిడిగుద్దులతో కొట్టిన దృశ్యాలను బంధువులు బయటపెట్టారు. భర్త తరచూ ఆమెను హింసించేవాడని, అతడి ప్రవర్తన చాలా దారుణంగా ఉండేదని ఆరోపిస్తున్నారు. కుటుంబ కలహాల పేరుతో సంవత్సరాలుగా ఆమె మానసిక, శారీరక వేధింపులు ఎదుర్కొంటున్నట్లు మృతురాలి బంధువులు తెలిపారు. ఈరోజు మీనాక్షి అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా, భర్త శివాజీ ఆమె ఉరివేసుకొని చనిపోయినట్లు చిత్రీకరించి అక్కడి నుంచి పరారైనట్లు తెలుస్తోంది. ఘటన సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు ప్రారంభించారు. ఇన్సూరెన్స్ డబ్బుల కోసమే ఈ హత్య జరిగిందా లేదా మరేదైనా వ్యక్తిగత కారణం ఉందా అనే దానిపై సమగ్ర విచారణ జరపాలని మృతురాలి కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. నిందితుడిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ ఘటనతో గోల్ తండాలో విషాద వాతావరణం నెలకొంది.



RNI NO:TGTEL/26/A0383 దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM

# తాబేళ్ల మనుగడపై ప్రపంచానికి హెచ్చరిక

**సముద్ర కాలుష్యంతో ప్రమాదంలో ద సముద్ర తాబేళ్లు.**
**ప్లాస్టిక్ వ్యర్థాలు, వాతావరణ మార్పులతో ఆందోళన.**
**ప్రకృతి సమతుల్యతకు తాబేళ్ల సంరక్షణ కీలకం.**




**జనం వాయిస్, డెస్క్, మే 22:**
భూమిపై కోట్ల సంవత్సరాలుగా జీవిస్తున్న అత్యంత పురాతన జీవుల్లో తాబేళ్లు ప్రత్యేక స్థానం కలిగి ఉన్నాయి. డైనోసార్ల కాలం నుంచే జీవిస్తూ వచ్చిన ఈ జీవులు ప్రస్తుతం మనుషుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ప్రమాదంలో పడుతున్నాయని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాబేళ్ల సంరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే 23న నిర్వహిస్తున్నారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో తాబేళ్ల పాత్ర ఎంతో ముఖ్యమని ఈ రోజు గుర్తు చేస్తోంది. సముద్ర జీవ వ్యవస్థ ఆరోగ్యంగా ఉండటానికి తాబేళ్లు కీలకంగా పనిచేస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ముఖ్యంగా సముద్ర గడ్డి పెరుగుదలను నియంత్రించడం ద్వారా సముద్రంలో ఆక్సిజన్ సమతుల్యతను కాపాడటంలో ఇవి సహాయపడతాయి. కొన్ని రకాల సముద్ర జీవులు అధికంగా పెరగకుండా నియంత్రించడం ద్వారా జీవ చక్రాన్ని సమతుల్యంలో ఉంచుతాయి. తాబేళ్ల సంఖ్య తగ్గిపోతే సముద్ర జీవ వ్యవస్థ మొత్తం దెబ్బతినే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్రస్తుతం సముద్రాల్లో పెరుగుతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు తాబేళ్లకు అతిపెద్ద ముప్పుగా మారాయి. నీటిలో తేలుతున్న ప్లాస్టిక్ సంచులు, బాటిళ్లు, చిన్న ప్లాస్టిక్ ముక్కలను ఆహారంగా భావించి తినడం వల్ల అనేక తాబేళ్లు ప్రాణాలు కోల్పోతున్నాయి. ముఖ్యంగా జెల్లీ ఫిష్‌లా కనిపించే పారదర్శక ప్లాస్టిక్ సంచులను తాబేళ్లు ఎక్కువగా మింగుతున్నాయని పరిశోధనలు చెబుతున్నాయి. ప్లాస్టిక్ కడుపులో ఇరుక్కుపోవడం వల్ల అవి ఆహారం తినలేక మెల్లగా మరణిస్తున్నాయి. సముద్ర తీర ప్రాంతాల్లో పేరుకుపోతున్న చెత్త కూడా తాబేళ్ల జీవనాన్ని ప్రభావితం చేస్తోంది. తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు తీర ప్రాంతాలకు వస్తాయి. కానీ తీరాల్లో ప్లాస్టిక్, గాజు ముక్కలు, రసాయన వ్యర్థాలు పేరుకుపోవడం వల్ల గుడ్లు సరిగా అభివృద్ధి చెందడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చిన్న తాబేళ్లు బయటకు వచ్చిన వెంటనే చెత్తలో చిక్కుకుని మరణిస్తున్న ఘటనలు నమోదవుతున్నాయి.

చేపల వేట కోసం ఉపయోగించే భారీ వలలు మరో ప్రధాన సమస్యగా మారాయి. సముద్రాల్లో వేసే వలల్లో చిక్కుకుని బయటపడలేక వేల సంఖ్యలో తాబేళ్లు ప్రతి సంవత్సరం మరణిస్తున్నాయని సముద్ర జీవ సంరక్షణ సంస్థలు వెల్లడిస్తున్నాయి. వలల్లో చిక్కుకున్న తాబేళ్లు పైకి రాలేక ఊపిరాడక చనిపోతున్నాయి. కొన్ని దేశాలు ప్రత్యేక రక్షణ పరికరాలు వాడాలని నిబంధనలు తీసుకొచ్చినా, అనేక ప్రాంతాల్లో వాటి అమలు సరిగా జరగడం లేదని చెబుతున్నారు. వాతావరణ మార్పుల ప్రభావం కూడా తాబేళ్లపై తీవ్రంగా పడుతోంది. సముద్ర తీరాల్లో ఇసుక ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల గుడ్ల అభివృద్ధి దెబ్బతింటోంది. శాస్త్రవేత్తల ప్రకారం తాబేళ్ల పిల్లల లింగ నిర్ధారణ ఉష్ణోగ్రతలపై ఆధారపడి ఉంటుంది. అధిక వేడి కారణంగా ఆడ తాబేళ్ల సంఖ్య పెరిగి, మగ తాబేళ్ల సంఖ్య తగ్గే పరిస్థితి ఏర్పడుతోందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి.

పర్యాటక రంగం విస్తరణ కూడా తాబేళ్ల సహజ జీవనంపై ప్రభావం చూపుతోంది. సముద్ర తీర ప్రాంతాల్లో భారీ రిసార్టులు, కృత్రిమ వెలుగులు, రాత్రి వేళ వినోద కార్యక్రమాలు పెరగడంతో తాబేళ్లు గుడ్లు పెట్టేందుకు రావడం తగ్గిందని పర్యావరణ కార్యకర్తలు చెబుతున్నారు. చిన్న తాబేళ్లు సముద్రం వైపు వెళ్లాల్సిన సమయంలో కృత్రిమ లైట్ల కారణంగా దారి తప్పుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక తాబేళ్ల జాతులు ప్రస్తుతం అంతరించిపోయే ప్రమాదంలో ఉన్నాయని అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా లెదర్‌బ్యాక్, హాక్స్‌బిల్, గ్రీన్ టర్టిల్ వంటి కొన్ని అరుదైన సముద్ర తాబేళ్ల సంఖ్య వేగంగా తగ్గుతోందని నివేదికలు చెబుతున్నాయి. అక్రమ వేట, గుడ్ల అక్రమ రవాణా కూడా కొన్ని ప్రాంతాల్లో ఇంకా కొనసాగుతుండటం పరిస్థితిని మరింత ప్రమాదకరంగా మారుస్తోంది. ప్రపంచ తాబేలు దినోత్సవం సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. సముద్ర తీరాల శుభ్రత కార్యక్రమాలు, విద్యార్థుల ర్యాలీలు, చిత్రలేఖన పోటీలు, ప్రకృతి పరిరక్షణ సదస్సుల ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచే ప్రయత్నాలు జరుగుతున్నాయి. చిన్నపిల్లల్లోనే ప్రకృతి సంరక్షణపై బాధ్యత పెంపొందించాలని నిపుణులు సూచిస్తున్నారు.

తాబేళ్లను రక్షించాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం అత్యంత అవసరమని పర్యావరణవేత్తలు చెబుతున్నారు. సముద్రాల్లో చెత్త వేయకుండా ఉండటం, పర్యావరణహిత వస్తువులు వినియోగించడం, సముద్ర తీరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించవచ్చని సూచిస్తున్నారు. ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్ తరాలకు జీవ వైవిధ్యంతో కూడిన ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని అందించవచ్చని ప్రపంచ తాబేలు దినోత్సవం మరోసారి గుర్తు చేస్తోంది.


# సంపాదకీయం

## గ్రామాల్లో తగ్గిపోతున్న సహజ ఆహార అలవాట్లు

**మారుతున్న జీవనశైలితో దూరమవుతున్న సంప్రదాయ భోజనం.**
**ఆరోగ్యంపై పెరుగుతున్న ప్రభావం.**
**మళ్లీ సహజ ఆహారాల వైపు అడుగులు అవసరం.**

**జనం వాయిస్, డెస్క్, మే 22:**
ఒకప్పుడు గ్రామీణ జీవితం అంటే సహజత్వానికి ప్రతీకగా ఉండేది. ఇంట్లో పండిన ధాన్యాలు, పొలాల్లో పండిన కూరగాయలు, రసాయనాలు లేని ఆహారం గ్రామాల ప్రత్యేకతగా కనిపించేది. జొన్నలు, సజ్జలు, రాగులు, కొర్రలు వంటి చిరుధాన్యాలు గ్రామీణ ప్రజల దైనందిన ఆహారంలో ముఖ్య భాగంగా ఉండేవి. ఉదయం నుంచి రాత్రి వరకు శారీరక శ్రమ చేసే ప్రజలకు ఇవే శక్తినిచ్చేవి. కానీ కాలం మారుతున్న కొద్దీ గ్రామాల్లో కూడా ఆహార అలవాట్లు పూర్తిగా మారిపోతున్నాయి. సహజ ఆహారాలకు బదులుగా తక్షణం సిద్ధమయ్యే పదార్థాలు, బయట ఆహారం, రసాయనాలతో తయారయ్యే పదార్థాలు ఎక్కువవుతున్నాయి. ఇప్పటి గ్రామాల్లో కూడా నగరాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకప్పుడు ఇంట్లోనే తయారయ్యే అల్పాహారాలు ఇప్పుడు ప్యాకెట్లలో వచ్చే పదార్థాలకు మారిపోయాయి. పిల్లలు నుంచి పెద్దల వరకు చిరుధాన్యాల కంటే తెల్లబియ్యం, వేయించిన పదార్థాలు, శీతల పానీయాలపై ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. సహజంగా లభించే ఆహారాల స్థానంలో రంగులు, రసాయనాలు కలిపిన పదార్థాలు గ్రామాల్లోకి వేగంగా చేరుతున్నాయి. ఇది కేవలం ఆహారపు మార్పు మాత్రమే కాదు, గ్రామీణ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్న ప్రమాదకర పరిస్థితి.

సహజ ఆహార అలవాట్లు తగ్గిపోవడంతో గ్రామాల్లో కూడా జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. ఒకప్పుడు గ్రామాల్లో అరుదుగా కనిపించే మధుమేహం, రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలు ఇప్పుడు సాధారణమవుతున్నాయి. శారీరక శ్రమ తగ్గిపోవడం, పోషక విలువలు లేని ఆహారం ఎక్కువ కావడం వల్ల చిన్న వయసులోనే ఆరోగ్య సమస్యలు



వస్తున్నాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పిల్లల్లో రోగనిరోధక శక్తి తగ్గిపోవడం ఆందోళన కలిగిస్తోంది. చిరుధాన్యాలు, పాతకాలపు ఆహారాల్లో ఉన్న పోషక విలువలను మర్చిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. జొన్న రొట్టెలు, రాగి సంగటి, సజ్జ రొట్టెలు, పెసర పప్పు, ఇంట్లో తయారయ్యే పచ్చళ్లు, నెయ్యి వంటి పదార్థాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు చెబుతున్నారు. కానీ ఇప్పుడు గ్రామాల్లో కూడా ఈ ఆహారాలు పండుగలకే పరిమితమవుతున్నాయి. రోజువారీ జీవితంలో వీటి వినియోగం తగ్గిపోవడం భవిష్యత్ తరాల ఆరోగ్యానికి ముప్పుగా మారుతోంది.

ఆహార అలవాట్ల మార్పుకు ప్రకటనల ప్రభావం కూడా ప్రధాన కారణంగా మారింది. రంగురంగుల ప్రకటనలు, త్వరగా సిద్ధమయ్యే పదార్థాల ప్రచారం గ్రామీణ ప్రజలను ప్రభావితం చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లలు బయట లభించే పదార్థాలపై ఆకర్షితులవుతున్నారు. ఇంట్లో తయారయ్యే ఆహారం కంటే ప్యాకెట్లలో వచ్చే పదార్థాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇది కుటుంబ ఆహార సంస్కృతిని కూడా క్రమంగా మార్చేస్తోంది. గ్రామాల్లో వ్యవసాయ పద్ధతులు మారడం కూడా సహజ ఆహారాల తగ్గుదలకు కారణమైంది. ఒకప్పుడు కుటుంబ అవసరాలకు అనుగుణంగా వివిధ పంటలు పండించేవారు. ఇప్పుడు ఎక్కువ లాభాల కోసం ఒకే రకమైన పంటలపై ఆధారపడుతున్నారు. దీని వల్ల ఇంటి అవసరాలకు ఉపయోగపడే సహజ ధాన్యాల ఉత్పత్తి తగ్గిపోతోంది. మార్కెట్‌పై ఆధారపడే పరిస్థితి పెరుగుతోంది.

పిల్లలకు చిన్నప్పటి నుంచే సహజ ఆహారాల ప్రాముఖ్యతను తెలియజేయాల్సిన అవసరం ఉంది. పాఠశాలల్లో కూడా పోషకాహారంపై అవగాహన పెంచాలి. ఇంట్లో పెద్దలు తీసుకునే ఆహార అలవాట్లే పిల్లలపై ప్రభావం చూపుతాయి. అందుకే కుటుంబ స్థాయిలోనే మార్పు రావాల్సిన అవసరం ఉంది. వారానికి కనీసం కొన్ని రోజులు అయినా చిరుధాన్యాలతో తయారయ్యే ఆహారం తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సహజ ఆహారాలపై మళ్లీ ఆసక్తి పెరుగుతోంది. నగరాల్లో కూడా చాలా మంది చిరుధాన్యాల వైపు మళ్లుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే పాతకాలపు ఆహారాలే ఉత్తమమని నిపుణులు చెబుతున్నారు. కానీ ఆశ్చర్యకరంగా గ్రామాల్లో మాత్రం ఈ ఆహారాల వినియోగం తగ్గిపోవడం బాధాకరమని ఆహార నిపుణులు అంటున్నారు.

ప్రభుత్వాలు కూడా చిరుధాన్యాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. పాఠశాల భోజనాల్లో, ప్రజా పంపిణీ వ్యవస్థలో సహజ ధాన్యాలను చేర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయి. రైతులకు ప్రోత్సాహకాలు అందించి చిరుధాన్యాల సాగును పెంచాలని నిపుణులు సూచిస్తున్నారు. ఇది రైతులకు ఆదాయం పెంచడమే కాక ప్రజల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని చెబుతున్నారు. గ్రామాలు ఒకప్పుడు ఆరోగ్యకరమైన జీవన విధానానికి ప్రతీకగా నిలిచాయి. ఆ సహజత్వాన్ని మళ్లీ తిరిగి తెచ్చుకోవాల్సిన అవసరం ఇప్పుడు ఎంతో ఉంది. ఆహారం కేవలం ఆకలి తీర్చేదిగా కాక ఆరోగ్యాన్ని కాపాడేదిగా ఉండాలి. పాతకాలపు సహజ ఆహారాల విలువను గుర్తించి మళ్లీ వాటి వైపు అడుగులు వేస్తేనే భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించగలుగుతాం.

# యువతలో తగ్గిపోతున్న నిద్ర సమయం

**అర్ధరాత్రి వరకు మేల్కొంటున్న యువత.**
**మొబైల్, ఉద్యోగ ఒత్తిడితో దెబ్బతింటున్న ఆరోగ్యం.**
**నిద్రలేమితో పెరుగుతున్న మానసిక సమస్యలు.**




**జనం వాయిస్, డెస్క్, మే 22:**
ఒకప్పుడు రాత్రి సమయానికి నిద్రపోవడం సహజ జీవన విధానంలో భాగంగా ఉండేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా యువతలో నిద్ర సమయం రోజు రోజుకు తగ్గిపోతుండటం వైద్య నిపుణులను ఆందోళనకు గురిచేస్తోంది. అర్ధరాత్రి వరకు మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఆటలు, చిత్రాలు, ఉద్యోగ పనులు, చదువులతో గడపడం ఇప్పుడు సాధారణంగా మారిపోయింది. చాలా మంది యువత రోజుకు అవసరమైన నిద్ర పొందడం లేదని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. రాత్రివేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉండటం వల్ల శరీరానికి అవసరమైన విశ్రాంతి దక్కడం లేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత తీవ్రంగా కనిపిస్తోందని చెబుతున్నారు. మొబైల్ ఫోన్లు యువత నిద్రను తీవ్రంగా ప్రభావితం చేస్తున్న ప్రధాన కారణాల్లో ఒకటిగా మారాయి. పడుకునే ముందు గంటల పాటు సామాజిక మాధ్యమాల్లో గడపడం, చిన్న వీడియోలు చూడడం, ఆటలు ఆడడం వల్ల మెదడు విశ్రాంతి స్థితికి వెళ్లడం లేదని నిపుణులు చెబుతున్నారు. మొబైల్ తెర నుంచి వచ్చే కాంతి నిద్రకు అవసరమైన హార్మోన్ల ఉత్పత్తిని తగ్గిస్తోందని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. దీంతో రాత్రి ఆలస్యంగా నిద్రపోవడం, ఉదయం ఆలస్యంగా లేవడం అలవాటుగా మారుతోంది. కొన్ని సందర్భాల్లో నిద్రపోయిన తర్వాత కూడా మధ్య మధ్యలో మేల్కొనే పరిస్థితులు పెరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఈ అలవాట్లు దీర్ఘకాలంలో శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

ఉద్యోగ ఒత్తిడి కూడా యువత నిద్రను దూరం చేస్తున్న మరో ప్రధాన కారణంగా మారింది. ముఖ్యంగా సమాచార సాంకేతిక రంగం, ప్రైవేటు సంస్థలు, రాత్రి విధులు నిర్వహించే ఉద్యోగాల్లో పనిచేసే యువత ఎక్కువగా నిద్రలేమితో బాధపడుతున్నారు. ఇంటి నుంచి పనిచేసే విధానం పెరగడంతో పని సమయాలకు పరిమితులు లేకుండా పోయాయని ఉద్యోగులు చెబుతున్నారు. పనిభారం, లక్ష్యాల ఒత్తిడి, ఉద్యోగ భయం కారణంగా చాలామంది రాత్రివేళల్లో కూడా మానసిక ఒత్తిడితోనే ఉంటున్నారు. విద్యార్థుల్లో కూడా ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పరీక్షల ఒత్తిడి, అదనపు శిక్షణ తరగతులు, పోటీ పరీక్షల సిద్ధత కారణంగా చాలా మంది విద్యార్థులు రాత్రి వేళల్లో ఎక్కువసేపు మేల్కొని ఉంటున్నారు. దీంతో శరీరానికి అవసరమైన విశ్రాంతి పూర్తిగా తగ్గిపోతోందని నిపుణులు పేర్కొంటున్నారు.

నిద్రలేమి కేవలం అలసటకే పరిమితం కాదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. సరిపడ నిద్ర లేకపోతే మధుమేహం, రక్తపోటు, గుండె సంబంధిత వ్యాధులు వచ్చే ప్రమాదం పెరుగుతుందని చెబుతున్నారు. అలాగే జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత కోల్పోవడం, కోపం పెరగడం, ఆందోళన, నిరాశ వంటి మానసిక సమస్యలు కూడా ఎక్కువవుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. కొంతమంది యువతలో ఒంటరితనం, ఆత్మవిశ్వాసం తగ్గిపోవడం వంటి పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని మానసిక వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఇప్పుడు మొబైల్ వినియోగం పెరగడంతో నిద్రలేమి సమస్య వేగంగా విస్తరిస్తోందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

నిద్ర సమస్యను చిన్న విషయంగా తీసుకోవద్దని వైద్యులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ ఒకే సమయానికి నిద్రపోవడం, పడుకునే ముందు మొబైల్ వినియోగాన్ని తగ్గించడం, రాత్రివేళ తేలికపాటి ఆహారం తీసుకోవడం, రోజూ కొంతసేపు వ్యాయామం చేయడం వంటి అలవాట్లు మంచి నిద్రకు సహాయపడతాయని చెబుతున్నారు. అలాగే మానసిక ప్రశాంతత కోసం కుటుంబ సభ్యులతో సమయం గడపడం, ప్రకృతికి దగ్గరగా ఉండడం కూడా అవసరమని సూచిస్తున్నారు. ఆధునిక జీవనశైలిలో డబ్బు, ఉద్యోగం, వినోదం ఎంత ముఖ్యమో ఆరోగ్యానికి నిద్ర కూడా అంతే అవసరమని యువత గుర్తించాలని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# లోన్ వసూళ్ల పేరుతో వేధింపులకు చెక్




**జనం వాయిస్, ముంబై, మే 21:**
రుణ వసూళ్ల పేరుతో కస్టమర్లను వేధిస్తున్న బ్యాంకులు, బ్యాంకేతర ఆర్థిక సంస్థలపై భారతీయ రిజర్వ్ బ్యాంకు కఠిన వైఖరి అవలంబించింది. రుణాల వసూళ్ల ప్రక్రియలో అనుసరించాల్సిన కొత్త నిబంధనలను ప్రతిపాదిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. రుణగ్రహీతల హక్కులకు రక్షణ కల్పించేలా కొత్త మార్గదర్శకాలను రూపొందించింది. లోన్ చెల్లింపులు ఆలస్యం అయ్యాయని కస్టమర్ల మొబైల్ ఫోన్‌లను పూర్తిగా బ్లాక్ చేయడం, ఫీచర్లు నిలిపివేయడం వంటి చర్యలను బ్యాంకులు చేపట్టరాదని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఫోన్ కొనుగోలుకు ప్రత్యేకంగా రుణం తీసుకున్న సందర్భాల్లో మాత్రమే కొన్ని షరతుల ఆధారంగా పరిమిత చర్యలకు అనుమతి ఉంటుందని తెలిపింది. అది కూడా బకాయి తొంభై రోజులు దాటిన తర్వాత, ముందుగా నోటీసులు ఇచ్చి స్పందన రాకపోతేనే చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అయినప్పటికీ అత్యవసర సేవలు, వచ్చే కాల్స్, అంతర్జాల సేవలను నిలిపివేయకూడదని ప్రతిపాదించింది. రుణగ్రహీత బకాయి చెల్లించిన వెంటనే గంటలోపు ఫోన్‌పై ఉన్న ఆంక్షలు తొలగించాలని ఆదేశించింది. ఆలస్యం జరిగితే గంటకు రెండువందల యాభై రూపాయల చొప్పున బ్యాంకులు పరిహారం చెల్లించాల్సి ఉంటుందని తెలిపింది. అలాగే రుణ వసూళ్లలో బెదిరింపులు, అసభ్య ప్రవర్తన, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం, సామాజిక మాధ్యమాల ద్వారా వేధింపులు పూర్తిగా నిషేధించాలని ఆర్బీఐ స్పష్టం చేసింది. ఉద్యోగులు, రికవరీ ఏజెంట్ల ప్రతి సంభాషణకు రికార్డులు నిర్వహించాలని కూడా సూచించింది. ఈ ప్రతిపాదనలపై ప్రజల అభిప్రాయాలను ఈ నెలాఖరు వరకు స్వీకరించనున్నారు. అనంతరం అక్టోబర్ నుంచి అమల్లోకి తీసుకురావాలని ఆర్బీఐ యోచిస్తోంది. రుణగ్రహీతల భద్రత, గౌరవాన్ని కాపాడేందుకు ఇది కీలక నిర్ణయంగా మారనుందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దివ్యాంగులకు సహాయక పరికరాల పంపిణీ

**మంత్రి వాకిటి శ్రీహరి చేతుల మీదుగా పంపిణీ.**
**ఉచితంగా ట్రైసైకిళ్లు, వీల్‌చైర్లు అందజేత.**
**పామ్ ఆయిల్ కొనుగోలు కేంద్రాలపై అధికారులకు ఆదేశాలు.**



**జనం వాయిస్, నారాయణపేట, మే 22:**
నారాయణపేట జిల్లాలో దివ్యాంగుల సాధికారత కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కీలక కార్యక్రమం నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర క్రీడలు, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, యువజన సేవలు, మత్స్యశాఖ మంత్రి వాకిటి శ్రీహరి దివ్యాంగులకు వివిధ సహాయక పరికరాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 34 రెట్రో ఫిటెడ్ మోటార్ వాహనాలు, 9 బ్యాటరీ వీల్‌చైర్లు, 8 ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. అదనంగా పలువురు లబ్ధిదారులకు ట్రైసైకిళ్లను ఉచితంగా అందజేశారు. ఈ పరికరాలు దివ్యాంగుల జీవనోపాధి, స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయని మంత్రి తెలిపారు. దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పంపిణీ కార్యక్రమం అనంతరం మంత్రి వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించారు. ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలు గ్రామీణ ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాల అమలుపై అధికారులతో చర్చించారు. ఎస్ఈఆర్‌పీ చేపల స్టాల్ వద్ద మహిళా సంఘాలు తయారు చేసిన ఫిష్ ఫ్రైను మంత్రి రుచి చూశారు. మత్స్యరంగం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నందుకు వారిని అభినందించారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధిలో స్వయం సహాయక సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే ఉద్యానవనం, పట్టు పరిశ్రమ శాఖ స్టాళ్లను కూడా మంత్రి పరిశీలించారు. పామ్ ఆయిల్ సాగు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులకు మద్దతుగా ప్రతి మండలంలో పామ్ ఆయిల్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా ఆదాయం పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు. జిల్లాలో దివ్యాంగులు, గ్రామీణ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పథకాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు నేరుగా ఉపయోగపడేలా చర్యలు కొనసాగిస్తామని అధికారులు తెలిపారు.

# బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కీలక సమావేశం

**రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఆధ్వర్యంలో భేటీ.**
**పార్టీ బలోపేతంపై నేతల చర్చ.**

**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు సమాచారం. సమావేశానికి పార్టీ ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి అభయ్ పాటిల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ శాసన సభా పక్ష నేత మహేశ్వర్ రెడ్డి, శాసన మండలి పక్ష నేత ఏవీఎన్ రెడ్డి కూడా సమావేశంలో హాజరయ్యారు. పార్టీ ఎంపీ రఘునందన్ రావు,



ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రాకేష్ రెడ్డి, డాక్టర్ పాల్వాయి హరీశ్ బాబు కూడా సమావేశంలో పాల్గొన్నారు. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ గౌతమ్ రావు కూడా హాజరయ్యారు. రాష్ట్రంలో పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పార్టీ పోరాటాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు సమాచారం. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకుని పార్టీ కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని నేతలు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. గ్రామస్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు సమాచారం. రాష్ట్రంలో ప్రజలకు చేరువయ్యే విధంగా ఆందోళనలు, ప్రజా కార్యక్రమాలు నిర్వహించాలని సమావేశంలో సూచించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడం వంటి అంశాలపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని నాయకత్వం సూచించింది. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని నేతలు నిర్ణయించినట్లు సమాచారం. పార్టీ బలోపేతానికి ప్రతి నాయకుడు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. తెలంగాణలో బీజేపీని మరింత బలమైన రాజకీయ శక్తిగా తీర్చిదిద్దేందుకు కార్యాచరణ కొనసాగుతుందని నాయకులు వెల్లడించారు.

# పీఎంజీఎస్‌వై నిధులపై సీతక్క విజ్ఞప్తి

**తెలంగాణకు మరిన్ని రోడ్డు పనులు మంజూరు చేయాలని డిమాండ్.**
**అటవీ చట్టాలతో ఆలస్యం అవుతున్న అభివృద్ధి పనులు.**
**సానుకూలంగా స్పందించిన కేంద్ర ప్రతినిధులు.**







**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
ప్రధాన్ మంత్రి గ్రామ సడక్ యోజన కింద తెలంగాణకు మరిన్ని రహదారి పనులు, అదనపు నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైదరాబాద్‌లో నిర్వహించిన దక్షిణాది రాష్ట్రాల పీఎంజీఎస్‌వై ప్రాంతీయ సమావేశంలో పాల్గొన్న మంత్రి, ముఖ్యంగా ఆదివాసి గిరిజన మారుమూల ప్రాంతాల్లో రహదారి అనుసంధానానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సంయుక్త కార్యదర్శి అతిథి సింగ్, ఎన్ఆర్ఐడీఏ డైరెక్టర్ జనరల్‌తో పాటు దక్షిణాది రాష్ట్రాల అధికారులు పాల్గొన్నారు. గత 25 ఏళ్లుగా పీఎంజీఎస్‌వై పథకం గ్రామీణ ప్రాంతాల్లో విద్య, వైద్యం, ఉపాధి, మార్కెట్లకు రాకపోకలను మెరుగుపరిచిందని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ పథకం మారుమూల గ్రామాలు, గిరిజన గూడెలను మైదాన ప్రాంతాలతో అనుసంధానం చేస్తోందన్నారు. తెలంగాణలో ఇంకా అనేక గ్రామాలకు రహదారి సౌకర్యాలు అవసరమని, పీఎంజీఎస్‌వై4 కింద మరిన్ని పనులు మంజూరు చేయాలని కోరారు. గతంలో ఈ పథకానికి అవసరమైన మొత్తం నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించేదని, ప్రస్తుతం రాష్ట్రాలపై 40 శాతం భారం మోపడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన, భౌగోళికంగా క్లిష్టమైన ప్రాంతాల రాష్ట్రాలకు ప్రత్యేక సడలింపులు ఇవ్వాలని సూచించారు. పాత విధానాన్ని పునరుద్ధరించి పూర్తి నిధులను కేంద్ర ప్రభుత్వమే భరించాలని విజ్ఞప్తి చేశారు. ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, ఆసిఫాబాద్ వంటి ఆదివాసి ప్రాంతాల్లో అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా రోడ్డు పనులకు అనుమతులు ఆలస్యమవుతున్నాయని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనాభివృద్ధి, గ్రామీణ రవాణా సౌకర్యాల దృష్ట్యా అటవీ నిబంధనల్లో అనుకూల మార్పులు చేయాలని కోరారు. ఇప్పటికే ఉన్న రహదారులు, కల్వర్టుల పునర్నిర్మాణ పనులకు కూడా అనుమతులు ఆలస్యమవుతున్నాయని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి వివరించారు. నాణ్యమైన రహదారుల నిర్మాణం, నిర్వహణ కోసం ఆధునిక సాంకేతికతలను వినియోగిస్తున్నామని చెప్పారు. గ్రామీణ రహదారుల నిర్వహణలో హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌ను రాష్ట్రం అమలు చేస్తోందని తెలిపారు. మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులకు గ్రామీణ ప్రజలు సులభంగా చేరుకునేలా రహదారి వ్యవస్థను విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. మంత్రి చేసిన విజ్ఞప్తులపై కేంద్ర ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తావించిన అంశాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు హామీ ఇచ్చారు. అటవీ, వన్యప్రాణి చట్టాల కారణంగా ఎదురవుతున్న సమస్యలపై కేంద్ర స్థాయిలో చర్చించి పరిష్కార మార్గాలను పరిశీలిస్తామని తెలిపారు. ప్రత్యేక అనుమతుల మంజూరు అంశాన్ని కూడా పరిశీలిస్తామని కేంద్ర ప్రతినిధులు వెల్లడించారు.

# వరి కొయ్యకాలు తగులబెట్టొద్దు

**రైతులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి.**
**అగ్నిప్రమాదాలతో పెరుగుతున్న ప్రమాదాలు.**
**ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని సూచన.**



**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
వరి కోతల అనంతరం వరి, మొక్కజొన్న కొయ్యకాలకు నిప్పు పెట్టవద్దని రైతులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కొయ్యకాలు తగులబెట్టడం వల్ల పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి, రైతుల ఆస్తులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల హుస్నాబాద్ నియోజకవర్గం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లెలో జరిగిన అగ్నిప్రమాద ఘటనను ప్రస్తావిస్తూ రైతులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. గుంటూరుపల్లెలో వరి కొయ్యకాలకు నిప్పు పెట్టడంతో గాలికి మంటలు వేగంగా వ్యాపించి గడ్డి కట్టలతో వెళ్తున్న ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైన ఘటన దురదృష్టకరమని మంత్రి తెలిపారు. అలాగే రవాణా శాఖ బీట్ రిపోర్టర్ వెంకన్న తండ్రి నూనెముంతల సత్తయ్య వరి కొయ్యకాలకు నిప్పు పెడుతుండగా మంటలు చెలరేగి పొగ కారణంగా ఊపిరాడక మృతి చెందడం బాధాకరమన్నారు. ఇలాంటి ఘటనలు మరెవరికీ జరగకూడదని పేర్కొన్నారు. వరి కొయ్యకాలు తగులబెట్టడం వల్ల నేలలోని సేంద్రియ పదార్థాలు, ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నాశనం అవుతాయని మంత్రి వివరించారు. దీని వల్ల భూసార శక్తి తగ్గిపోయి భవిష్యత్తులో పంట దిగుబడులపై ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. గాలి కాలుష్యం పెరిగి ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు, ఇతర ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. అంతేకాకుండా పక్క పొలాలు, చెట్లు, విద్యుత్ లైన్లకు కూడా అగ్నిప్రమాదాలు సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. వేగంగా వ్యాపించే మంటల వల్ల రైతులు ఆస్తి నష్టాలతో పాటు ప్రాణనష్టాలు కూడా ఎదుర్కొనే పరిస్థితులు వస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో వడగాలుల కారణంగా అగ్నిప్రమాదాలు మరింత ప్రమాదకరంగా మారుతున్నాయని తెలిపారు. రైతులు వరి పరకను ట్రాక్టర్ల ద్వారా నేలలో కలపడం, పశువుల మేతగా వినియోగించడం, కంపోస్ట్ లేదా సేంద్రియ ఎరువుల తయారీలో ఉపయోగించడం వంటి ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించాలని మంత్రి సూచించారు. అదేవిధంగా మష్రూమ్ పెంపకం, బేలర్ యంత్రాల ద్వారా సేకరించి విక్రయించడం ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని వివరించారు. వ్యవసాయ శాఖ కూడా పరక కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను ప్రోత్సహిస్తోందని మంత్రి తెలిపారు. రైతులు బాధ్యతాయుతంగా వ్యవహరించి అగ్నిప్రమాదాలను నివారించాలని విజ్ఞప్తి చేశారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భూసారాన్ని కాపాడేందుకు రైతులు సహకరించాలని పిలుపునిచ్చారు.

# ప్రజా పాలనతో సంక్షేమ ఫలాలు

**జూన్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు.**
**విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు.**
**ములుగులో జిల్లా స్థాయి సమావేశం.**
**మంత్రి దనసరి అనసూయ సీతక్క.**



**జనం వాయిస్, ములుగు, మే 22:**
ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ద్వారా ప్రతి ఇంటికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తెలిపారు. ములుగు జిల్లా లీలా గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో మంత్రి పాల్గొన్నారు. జూన్ రెండో తేదీ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు, కొత్త పెన్షన్ల మంజూరు ప్రారంభిస్తామని ప్రకటించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రజా సమస్యలను గుర్తించి పరిష్కరిస్తున్నామని మంత్రి తెలిపారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కొనసాగుతున్న ఈ కార్యక్రమం ప్రజలకు ప్రభుత్వ పథకాలపై పూర్తి అవగాహన కల్పిస్తోందన్నారు. పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నరకం వడ్లకు బోనస్, చేయూత పెన్షన్లు, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్, వడ్డీ లేని రుణాలు, కొత్త రేషన్ కార్డులు వంటి పథకాలను ప్రభుత్వం సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి వివరించారు. అర్హుల జాబితాలను వెంటనే సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రీ ప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ పథకం అమలు చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. రోజు విడిచి రోజు రాగి జావ, వేడి పాలు అందిస్తామని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించనున్నట్లు చెప్పారు. దివ్యాంగ ఇంటర్ విద్యార్థులకు మోటరైజ్డ్ వాహనాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ములుగు నియోజకవర్గానికి రాష్ట్రంలోనే అత్యధికంగా ఇందిరమ్మ ఇండ్లు కేటాయించామని మంత్రి తెలిపారు. జిల్లాలో కొత్తగా 38 వేలకుపైగా పెన్షన్లు జూన్ రెండో తేదీన పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్యలు లేవని, రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ములుగు జిల్లాలో యువత కోసం భారీ మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కూడా తెలిపారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాలకు స్త్రీనిధి, బ్యాంక్ లింకేజీ కింద కోట్ల రూపాయల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. అలాగే కళ్యాణలక్ష్మి చెక్కులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాలు లబ్ధిదారులకు అందజేశారు. సమావేశంలో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



# జవహర్‌నగర్ డంప్‌యార్డ్‌పై ఈటల ఆందోళన

**జనం వాయిస్, హైదరాబాద్, మే 22:**
జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై అఖిలపక్ష నాయకులు, ప్రభుత్వ అధికారులు, రాంకీ సంస్థ ప్రతినిధులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించినట్లు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన జవహర్‌నగర్ డంప్‌యార్డ్ వల్ల పరిసర ప్రాంతాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రపంచ చరిత్రలోనే ఒకే ప్రాంతంలో పదివేల మెట్రిక్ టన్నుల చెత్త పేరుకుపోయే పరిస్థితి ఎక్కడా లేదని విమర్శించారు. ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం చెత్తను పూర్తిస్థాయిలో రీసైకిల్ చేయాల్సి ఉండగా రాంకీ సంస్థ ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించడం లేదని ఈటల రాజేందర్ ఆరోపించారు. ప్రతిరోజూ వచ్చే చెత్తలో సగం కూడా రీసైకిల్ చేయడం లేదన్నారు. దీని కారణంగా భారీగా చెత్త పేరుకుపోయి దానివల్ల వచ్చే కలుషిత నీరు భూగర్భ జలాల్లో కలుస్తోందని పేర్కొన్నారు. జవహర్‌నగర్ పరిసర ప్రాంతాల్లోని చెరువులు పూర్తిగా నాశనమయ్యాయని, భూగర్భ జలాలు విషతుల్యమయ్యాయని ఈటల రాజేందర్ ఆందోళన వ్యక్తం చేశారు. గాలి, నీరు, ధ్వని కాలుష్యాల ప్రభావంతో లక్షలాది మంది ప్రజల ఆరోగ్యం దెబ్బతింటోందన్నారు. గర్భిణీలకు గర్భస్రావాలు జరుగుతున్నాయని, పశుసంపద మరణిస్తోందని, ఈ ప్రాంతం మనుషులు నివసించలేని స్థితికి చేరుకుందని పేర్కొన్నారు. డంప్‌యార్డ్ ఏర్పాటులో జీరో డిశ్చార్జ్, కాలుష్యం ఉండదనే నిబంధనలు పూర్తిగా ఉల్లంఘించబడినట్లు ఆరోపించారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు తక్షణ చర్యలు అవసరమని అన్నారు. ఈ సమస్యపై ముఖ్యమంత్రి ఎ రేవంత్ రెడ్డితో కూడా చర్చించినట్లు వెల్లడించారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై ముఖ్యమంత్రికి పూర్తి అవగాహన ఉందని చెప్పారు. అఖిలపక్ష నాయకులు, ప్రభుత్వ అధికారులు, రాంకీ ప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నామని ఈటల తెలిపారు. కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో కలిసి డంప్‌యార్డ్ పరిస్థితిని పరిశీలించినట్లు చెప్పారు. సమస్యపై మూడు రోజుల్లో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా ముఖ్యమంత్రితో సమావేశమై శాశ్వత పరిష్కారంపై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. ఒకే ప్రాంతంలో భారీగా చెత్త వేయడం కాకుండా వివిధ ప్రాంతాల్లో చెత్త నిర్వహణ కేంద్రాలు ఏర్పాటు చేయాలని పరిశీలిస్తున్నట్లు ఈటల రాజేందర్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని శాశ్వత పరిష్కారం అందించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. జవహర్‌నగర్ డంప్‌యార్డ్ సమస్యపై భారతీయ జనతా పార్టీ అనేక సంవత్సరాలుగా పోరాటం చేస్తోందని, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారాన్ని కూడా తీసుకుంటామని స్పష్టం చేశారు.



జనం వాయిస్ తెలుగు దినపత్రిక RNI NO:TGTEL/26/A0383 WWW.JANAMVOICE.COM

# మంచిర్యాల ఎగ్జిబిషన్‌లో 'కాశ్మీర్ జలకన్య 'దోపిడీ!

- టికెట్ ధర అడిగితే నిర్వాహకుల దురుసుతనం.. సామాన్యుల జేబులకు చిల్లులు.
- అనుమతులు లేకున్నా ఇష్టారాజ్యంగా వసూళ్లు.. తనిఖీలు చేపట్టాలని డిమాండ్.




**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో నిఘా నిద్రపోతుండటంతో కొందరు నిర్వాహకులు నిలువు దోపిడీకి తెరలేపారు. ఎలాంటి ముందస్తు అనుమతులు లేకుండానే మంచిర్యాల సీసీసీ నస్పూర్ పోలీస్ స్టేషన్ సమీపంలో "కాశ్మీర్ జలకన్య" పేరుతో ఎగ్జిబిషన్ నిర్వహిస్తూ సామాన్య ప్రజలను దగా దండుకుంటున్నారు. సంబంధిత అధికారులు మాత్రం అంతా తెలిసినా ఏమీ తెలియనట్టు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది.




### టికెట్లపై ధరలుండవు.. అడిగితే దురుసు ప్రవర్తన!

వినోదం కోసం కుటుంబాలతో సహా వచ్చే సామాన్య ప్రజల జేబులకు నిర్వాహకులు చిల్లులు పొడుస్తున్నారు. నిబంధనలను పూర్తిగా పక్కనబెట్టి, ఎంట్రీ మరియు రైడ్స్ టికెట్లపై ఎలాంటి ధరలు ముద్రించకుండా ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. సాధారణంగా ప్రభుత్వం నిర్దేశించిన ధరల పట్టిక ప్రదర్శించాల్సి ఉండగా, ఇక్కడ మాత్రం టికెట్లపై అసలు ధరే ఉండటం లేదు. ఒకే రైడ్‌కు ఒకరి వద్ద ₹50 తీసుకుంటే, మరొకరి వద్ద ₹100 గుంజుతున్నారు. ఈ ధరల వ్యత్యాసాన్ని గమనించి ఎందుకు అని ప్రశ్నించిన సందర్శకులపై సదరు సిబ్బంది కనీస మర్యాద లేకుండా, అత్యంత దురుసుగా ప్రవర్తిస్తుండటం పట్ల స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ధరలు లేని ఈ టికెట్ల ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో సైతం తెగ వైరల్ అవుతున్నాయి.

### అధికారుల ఉదాసీనత.. స్థానికుల డిమాండ్

పోలీస్ స్టేషన్‌కు అత్యంత సమీపంలోనే ఇంత బహిరంగంగా అక్రమ దందా సాగుతున్నా.. మున్సిపల్, రెవెన్యూ, తూనికలు-కొలతల శాఖ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, ఈ ఎగ్జిబిషన్‌పై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరించకుండా టికెట్లపై కచ్చితంగా ధరలు ముద్రించేలా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించి ప్రజలను దోచుకుంటున్న వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని మంచిర్యాల ప్రజలు కోరుతున్నారు

# ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ.

**గార్ల /జనం వాయిస్ :**

మండు వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ రాంబాబు,యువశక్తి యూత్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సురేష్ నాయక్, వార్డు సభ్యులు గంగావత్ కిషన్ నాయక్, స్వరూప అన్నారు. ఎండతీవ్రత, వడదెబ్బ నుంచి ఉపాధి హామీ కూలీలను రక్షించడానికి మండల పరిధిలోని చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ ట్రాచు పాముల కుంటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలకు శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండ తీవ్రత అధికంగా ఉన్నందువలన కూలీలు ఉదయం పూట ఆరు గంటల లోపే పని ప్రదేశాలకు చేరుకోవాలన్నారు. ఎండ పెరగకముందే పనులు ముగించుకోవడం మంచిదని సూచించారు. పనులు చేసే సమయంలో కూలీలు తరచూగా నీరు త్రాగాలన్నారు. అలసట, నీరసంగా అనిపించినప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం మంచిదని తెలిపారు. ఎండలో పనిచేసే సమయంలో తలపై గుడ్డ లేదా టోపీ ధరించాలని మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రతలో ఉపాధిహామీ పనులు చేయకూడదని సూచించారు. ఈకార్యక్రమంలో ఉపాధిహామీ కూలీలు, యువకులు మాలోత్ మోతిలాల్, భూక్యా ఉదయ్, భాస్కర్, భూక్యా మోహన్, గంగావత్ సేన, మాలోత్ శంకర్,గుగులోత్ బాబులాల్, బానోత్ బాలు తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాల రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని శవం లభ్యం

**మృతుడి వివరాల కోసం పోలీసుల అన్వేషణ.. నశం రంగు ప్యాంటు, తెల్ల బనియన్‌తో గుర్తింపు.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

మంచిర్యాల - పెద్దంపేట రైల్వే స్టేషన్ల మధ్య శుక్రవారం తెల్లవారుజామున ఒక విషాద ఘటన చోటుచేసుకుంది. రైల్వే స్టేషన్ల మధ్య గల అండర్ బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ప్రమాద తీవ్రతకు మృతుడి తల పగిలి, శరీర భాగాలు ఛిన్నభిన్నమయ్యాయి. మృతుడు నశం రంగు (గోధుమ/ఆష్ కలర్) ప్యాంటు, తెల్లని బనియన్ ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. జీఆర్పీ ఎస్సై మహేందర్ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ జస్పాల్ సింగ్ కేసు నమోదు చేసుకుని, మృతుడి వివరాల కోసం దర్యాప్తు జరుపుతున్నారు.



# నర్సరీలో మొక్కలను సంరక్షించాలి

- మొక్కలు ఎండిపోకుండా నీరందించాలి.
- ఎదుగుతున్న మొక్కలను కాపాడాలి.
- నర్సరీలో మొక్కలకు రెండు పూటలా నీళ్లు పట్టాలి.
- సర్పంచ్ గూగులోత్ భద్రు నాయక్.



**గార్ల /జనం వాయిస్ :**

వేసవిలో ఎండల తీవ్రతతో చిన్నకిష్టాపురం గ్రామపంచాయతీ నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా సర్పంచ్ గుగులోత్ భద్రు నాయక్ స్వయంగా నర్సరీని సందర్శించి మొక్కలకు నీరు పట్టారు. శనివారం గ్రామపంచాయతీ పరిధిలోని నర్సరీని సందర్శించి అందులోని మొక్కలను పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, వేసవిలో మండుతున్న ఎండ తీవ్రతకు నర్సరీలో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ఎప్పటికప్పుడు నీరందించాలన్నారు. ఎదుగుతున్న మొక్కలను కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. నర్సరీలో మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ మొక్కలు ఎదిగేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా కంటికి రెప్పలా సంరక్షించాలని, అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. వేసవిలో నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా సర్పంచ్ భద్రు నాయక్ స్వయంగా నర్సరీని సందర్శించి మొక్కలకు నీరు పట్టిన తీరును ప్రజలు అభినందిస్తున్నారు. ఇదే ఉత్సాహంతో గ్రామపంచాయతీ అభివృద్ధి కొరకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. పారిశుద్ధ్యం, పరిశుభ్రత, నర్సరీ మొక్కల సంరక్షణ, మంచి నీటి సమస్యల పరిష్కారం, విధిలైట్ల ఏర్పాటు,పూర్తిస్థాయిలో నిర్వహిస్తు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్న సర్పంచ్ కు ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# 61 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.

**రూ. 40.71 లక్షల చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎంఆర్ఎఫ్ ఒక వరమని, ఆపదలో ఉన్న కుటుంబాలకు ఇది కొండంత అండగా నిలుస్తోందని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లి తదితర ప్రాంతాలకు చెందిన 61 మంది లబ్ధిదారులకు రూ. 40,71,400 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన చేతుల మీదుగా పంపిణీ చేశారు. వివిధ రకాల అనారోగ్యాలు, ఇతర ఆపత్కాలంలో ఉన్నవారికి ఉపశమనం కలిగించేందుకు ఉద్దేశించిన ఈ ఆర్థిక సహాయాన్ని అందజేసిన అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగానే ఈ నిధి ద్వారా అర్హులైన వారికి అండగా నిలుస్తోందని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల కష్టాలను తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఆయన, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు చేరువయ్యేలా చూస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.




# ప్రభుత్వ విద్య బలోపేతానికి కృషి: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు

**ప్రైవేట్ స్కూళ్లతో సమానంగా సర్కారు బడులు.. పెరుగుతున్న పిల్లల సంఖ్య.**

**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

మంచిర్యాల నియోజకవర్గంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు తెలిపారు. శుక్రవారం ఆయన తన నివాసంలో మాట్లాడుతూ.. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత సర్కారు బడుల్లో మౌలిక వసతులు పెంచడంతో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు.



# మృతుడి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు.

**కాంగ్రెస్ నేత ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి.**

**మరిపెడ(మే 22)జనం వాయిస్:**

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లూనావత్ తండాకు చెందిన లకావత్ లచ్య నాయక్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు ఒంటికొమ్ము యుగంధర్ రెడ్డి శుక్రవారం తండాకు చేరుకుని మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుని ఇంటి వద్దకు వెళ్లిన యుగంధర్ రెడ్డి లచ్య నాయక్ పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ,కష్ట సమయంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పరామర్శ కార్యక్రమంలో లూనావత్ తండా సర్పంచ్ లూనావత్ సోనియా వెంకన్నతో పాటు కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు,కార్యకర్తలు,తండావాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మృతుడి కుటుంబానికి ఓదార్పునిచ్చేందుకు అందరూ కలిసి మద్దతు తెలిపారు. లచ్య నాయక్ మృతి పట్ల తండాలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఆయన కుటుంబానికి స్థానిక ప్రజలు,నాయకులు సానుభూతి తెలియజేస్తున్నారు.



# మాదకద్రవ్యాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దు: మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్

## - అడిక్షన్ సెంటర్‌లో బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించిన పోలీసులు

**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

యువత మాదకద్రవ్యాల బానిసలుగా మారితే జీవితానికి అర్థం లేకుండా పోతుందని, తల్లితండ్రులు ఎన్నో కష్టాలు ఓర్చి, చదివించి పోషిస్తుంటే వారికి సమాజంలో గౌరవం తెచ్చే విధంగా ప్రయోజకులుగా మారి మంచి పేరు తేవాలని మంచిర్యాల డిసిపి ఏ.భాస్కర్ పిలుపునిచ్చారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన అడిక్షన్ సెంటర్లో చికిత్స పొందుతున్న బాధితులకు మంచిర్యాల ఏసిపి ఆర్.ప్రకాష్ ఆధ్వర్యంలో, పట్టణ ఎస్ హెచ్ ఓ. ప్రమోద్ రావు నేతృత్వంలో శుక్రవారం ఒక ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డిసిపి ఏ.భాస్కర్ చికిత్స పొందుతున్న వారితో ప్రత్యక్షంగా మాట్లాడి, భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు తిరిగి పునరావృతం కాకుండా చూసుకోవాలని, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులు తమ తప్పులను తెలుసుకొని సమాజ సేవలో ముందుండాలని, తల్లిదండ్రులకు గౌరవప్రదంగా ఉండేందుకు కష్టపడి పనులు చేస్తూ జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. బాధితుల్లో మానసిక ధైర్యాన్ని నింపి, వారు వ్యసనాల నుంచి త్వరగా కోలుకునేలా చేసేందుకు పోలీసులు, వైద్య బృందం సంయుక్తంగా ఈ ప్రత్యేక కౌన్సిలింగ్



నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ అడ్మిన్ వైద్యులు శ్రీమన్నారాయణ, మానసిక వైద్య నిపుణులు రామ్ నాయక్, నర్సింగ్ ఆఫీసర్లు, ఆసుపత్రి సిబ్బంది మరియు పోలీస్ అధికారులు తదితరులు పాల్గొని బాధితులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు.

# హైదరాబాద్‌లో ఘనంగా 2026 ఎడ్యుకేషన్ ఎక్స్‌పో

## విద్యార్థులకు ఉన్నత విద్య, కెరీర్ అవకాశాలపై మార్గదర్శనం.

**జనం వాయిస్. హుస్నాబాద్ మే.22**

హైదరాబాదులోని హైటెక్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహించిన 2026 ఎడ్యుకేషన్ ఎక్స్‌పో విజయవంతంగా జరిగింది. ఉన్నత విద్య, సాంకేతిక విద్య, కెరీర్ అవకాశాలపై విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయడమే ఈ ఎక్స్‌పో ప్రధాన ఉద్దేశ్యంగా నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎడ్‌టెక్‌రివ్యూ ఆధ్వర్యంలో నిర్వహించిన హయ్యర్ ఎడ్యుకేషన్ టెక్నాలజీ కాన్ఫరెన్స్ & ఎక్స్‌పో2026 ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు ప్రముఖ విద్యాసంస్థలు, ఇంజనీరింగ్ కళాశాలలు పాల్గొని విద్యార్థులకు భవిష్యత్ విద్యా ప్రణాళికలు, సాంకేతిక పరిజ్ఞానం, ఉద్యోగ అవకాశాలపై అవగాహన కల్పించాయి. ఈ కార్యక్రమంలో అక్కన్నపేట మండలం పంతులుతండా గ్రామానికి చెందిన ఎల్లంకి కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ కే. మోతిలాల్ మరియు అధ్యాపక బృందం విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తమ ఆసక్తులకు అనుగుణంగా ఉన్నత విద్యను ఎంచుకొని భవిష్యత్తును సుస్థిరంగా నిర్మించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, మాజీ మంత్రి మల్లారెడ్డి, ఉన్నతాధికారులు, పలు ఇంజనీరింగ్ కళాశాలల చైర్మన్లు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# డోర్నకల్ ఎమ్మెల్యేకు డిప్యూటీ స్పీకర్ పదవి.

## గిరిజన జాతికి గౌరవం.





**డోర్నకల్/మరిపెడ(మే 22)జనం వాయిస్:**

డోర్నకల్ నియోజకవర్గ ఎమ్మెల్యే,వృత్తిరీత్యా వైద్యుడైన డాక్టర్ జాటోత్ రాంచందర్‌నాయక్ తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికయ్యారు.2023 అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన,కేవలం 18 నెలల్లోనే ప్రభుత్వ విప్ నుంచి డిప్యూటీ స్పీకర్ పదవికి ఎదిగి మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణంగా నిలిచారు.

### వైద్యం నుంచి రాజకీయం వరకు.

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం బొమ్మకల్లు సర్పంచ్‌తండాకు చెందిన రాంచందర్‌నాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎంబీబీఎస్,ఎంఎస్ సర్జన్ పట్టాలు పొందారు.సూర్యాపేటలో ఒక ఆస్పత్రిని'స్థాపించి పేదలకు వైద్య సేవలందించారు.ఆయన సతీమణి డాక్టర్ ప్రమీల గైనకాలజిస్ట్‌గా వైద్య వృత్తిలో కొనసాగుతున్నారు. డాక్టర్ రామచంద్రు నాయక్ 2006లో టీడీపీ పార్టీనుండి రాజకీయ ప్రవేశం చేసిన రాంచందర్‌నాయక్,2014లో టీడీపీ తరఫున డోర్నకల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు.2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలోకి దిగినా విజయం దక్కలేదు.ఐనా పట్టు వదలకుండా ప్రజల మధ్య ఉంటూ,అంచెలంచెలుగా ఎదుగుతూ తమకంటూ అభిమాన సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని,ఓడిన చోటనే గెలుపును కోరుకొని మొక్కబోణి లక్ష్యంతో నియోజకవర్గ ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు,ఈరోజు నియోజకవర్గ ప్రజలకు సేవలంధించే స్థాయికి ఎదిగారు.2023 ఎన్నికల్లో మాజీ ఎమ్మెల్యే -మంత్రి డీఎస్ రెడ్యానాయక్‌పై ఘన విజయం సాధించి తొలిసారి శాసనసభలో అడుగుపెట్టారు.

### డోర్నకల్ అభివృద్ధికి ప్రాధాన్యం.

ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత డోర్నకల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారు రోడ్లు,తాగునీరు,విద్య,వైద్య రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారు.గిరిజన తండాలు,గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన,సీసీ రోడ్లు,డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయించారు.ప్రభుత్వ విప్‌గా ఉన్న సమయంలోనే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,ప్రారంభోత్సవాలు చేశారు. పేద విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్,ఆరోగ్యశ్రీ వంటి పథకాల అమలులోనూ ప్రత్యేక శ్రద్ధ చూపారు.వైద్యుడు కావడంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవల మెరుగుదల,డాక్టర్లు,నర్సుల కొరత భర్తీపై అసెంబ్లీలో పలుమార్లు ప్రస్తావించారు.

### 18 నెలల్లోనే కీలక పదవులు.

నాయకుడుగా ఎదుగుడే కాకుండా రెండు ముఖ్యమైన పదవులు దక్కిచ్చుకున్నాడంటే ఆయనని అధిష్టానం ఎంతగా గుర్తిస్తుందో అర్థం చేసుకోవాలి.గత 18 నెలలుగా ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు నిర్వర్తించిన రామచంద్రు నాయక్,గిరిజన ప్రాంత సమస్యలు,పోడు భూములు,విద్యా వైద్య సమస్యలపై అసెంబ్లీలో గట్టిగా గళమెత్తారు.గిరిజనుల హక్కులు కాపాడడమే నా తొలి ప్రాధాన్యం అని పలు సభల్లో స్పష్టం చేశారు. ఆయన ప్రసంగాల్లో గిరిజన సంస్కృతి,భాష,హక్కుల పరిరక్షణ ప్రధానంగా కనిపిస్తుంది.అభివృద్ధి పనులతో పాటు సామాజిక న్యాయం కోసం నిలబడే నేతగా గుర్తింపు తెచ్చుకున్నారు.ఆయన కృషిని గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం 2025 జూన్ 8న డిప్యూటీ స్పీకర్ పదవి కట్టబెట్టింది. డిప్యూటీ స్పీకర్‌గా ఎంపికవడంపై స్థానిక కాంగ్రెస్ శ్రేణులు,గిరిజన సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.ఇది కేవలం రాంచందర్‌నాయక్‌కు మాత్రమే కాదు,మహబూబాబాద్ జిల్లా,గిరిజన ప్రజలకు దక్కిన గౌరవం అని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు.

**డాక్టర్ నుంచి డిప్యూటీ స్పీకర్ వరకు సాగిన రాంచందర్‌నాయక్ ప్రయాణం..పట్టుదలతోఉంటే సాధించలేనిది ఉండదు అనేది రామ చంద్రునాయక్ ఎదిగిన తీరు ఉదాహరణగా నిలుస్తోంది.**

# వడ్ల కొనుగోలు త్వరితగతిన పూర్తి చేయాలి.

## ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేసిన హుస్నాబాద్ బీజేపీ నాయకులు.

**జనం వాయిస్, హుస్నాబాద్ మే.22:**

బీజేపీ రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు హుస్నాబాద్ లో స్థానిక ఎమ్మార్వో కు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా బీజేపీ హుస్నాబాద్ మండల అధ్యక్షులు భూక్య సంపత్ నాయక్ మాట్లాడుతూ వడ్ల కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని తరుగు, తేమ లేకుండా కొనుగోలు చేయాలని రైతులకు కావాల్సిన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు . కొన్ని గ్రామాలలో లారీలు అందుబాటులో లేకపోవడం వలన రైతులు తమసొంత ట్రాక్టర్ల పై వడ్లను తీసుకెళ్తున్న రైతులకు ఇబ్బంది అవుతుంది కావున ఎక్కువ మొత్తంలో లారీలను సమకూర్చాలని డిమాండ్ చేశారు. రైతులకు ఏ ఇబ్బంది కలిగినా బిజెపి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహిస్తామని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు కుంట మల్లయ్య, బైరి అరుణ్, నెల్లి శ్రీనివాస్, మెరుగు రవి, రంజిత్, తదితరులు పాల్గొన్నారు.



# నష్టపోయిన రైతులను ఆదుకుంటాం.

## ధాన్యం కాలిపోయిన సంఘటన బాధాకరం.
## రైతుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంటుంది.
## ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు.



**జనం వాయిస్, పెద్దపల్లి, మే 22:**

పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గాంధీనగర్ లో గురువారం ప్రమాదవశాత్తు ధాన్యం మరియు కొంత పంట పొలం దగ్ధమైన సందర్భంగా నష్టపోయిన తోట రామకృష్ణ, తోట రాకేష్ రైతుల వరి ధాన్యం కుప్పలను మరియు ఘటన స్థలాన్ని పరిశీలించి తన వంతు బాధితులకు కొంత నగదు సహాయం అందించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణ రావు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ.. పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని చందపల్లి గాంధీనగర్లో రైతులు తోట రాకేష్ కొంత వరి ధాన్యం మరియు రామకృష్ణ రైతుది కొంత పంట పొలం దగ్ధం అవడం బాధాకరం అని అన్నారు. ఆ ఇద్దరి రైతులను ప్రభుత్వం ద్వారా ఆదుకుంటామని వరి ధాన్యం కాలిపోయిన రైతు సోదరులు అధైర్య పడవద్దని నష్టపరిహారం కు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారం అందించేలా కృషి చేస్తానని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో ఉందని ప్రతీ ధాన్యం గింజ కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం మరియు మేము తీసుకుంటున్నామని గుర్తు చేశారు. గాంధీనగర్ లో నష్టపోయిన రైతులకు అండగా నిలిచి వారికి తోడుగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, స్థానిక కౌన్సిలర్లు మరియు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



# సమర్థవంతంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ

## అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలి.
## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి.
## జిల్లా స్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశం.

**జనం వాయిస్, మంచిర్యాల, మే 22:**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణను అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఆదేశించారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా స్థాయి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి, వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల పురోగతిని సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపు, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్ల మంజూరు, గృహజ్యోతి, ఇందిరా మహిళా శక్తి వంటి పథకాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొత్త రేషన్ కార్డుల పంపిణీ, సన్న బియ్యం సరఫరా ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని స్పష్టం చేశారు. రైతు సంక్షేమ పథకాలైన రైతు భరోసా, రైతు బీమా, సన్న రకాల వడ్లకు బోనస్ వంటి వాటిని సమర్ధవంతంగా అమలు చేయడంతో పాటు, పంట మార్పిడి, వాణిజ్య పంటల సాగుపై రైతులకు విస్తృతంగా అవగాహన



కల్పించాలని కలెక్టర్ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. వేసవి కాలంలో జిల్లాలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విద్యా రంగ అభివృద్ధిలో భాగంగా పాఠశాలల్లో అల్పాహార పథకం అమలును పర్యవేక్షించాలని, కొత్త పాఠశాలల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు బస్తీ దవాఖానాలు, ఆరోగ్య కేంద్రాలు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలపై అధికారులు తక్షణమే స్పందించి, పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, జిల్లా పరిషత్ సీఈఓ గణపతి, ముఖ్య ప్రణాళిక అధికారి పాపయ్య, మున్సిపల్ డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, వివిధ మున్సిపల్ చైర్ పర్సన్లు, ప్రజాప్రతినిధులు మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొని జిల్లా సర్వతోముఖాభివృద్ధికి సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

దైనిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# దూసుకెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ.

**యువత మద్దతు BSPకే: రవీందర్ గౌడ్.
దూసుకెళ్తున్న కాక్రోచ్ జనతా పార్టీ...!
బి ఎస్ పి కి వచ్చే ఎన్నికల్లో యువత అండ.
పచ్చిమట్ల రవీందర్ గౌడ్.
బిఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి.**




**జనం వాయిస్ హుస్నాబాద్ మే.22:**
హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కాలం గడుపుతున్న ప్రభుత్వాలకు యువత తగిన సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉందని బీఎస్పీ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పచ్చిమట్ల రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నిరుద్యోగులు, ఆర్టీఐ కార్యకర్తలు, జర్నలిస్టులు, లాయర్లపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మహారాష్ట్రకు చెందిన అభిజిత్ దుల్కే "కాక్రోచ్ జనతా పార్టీ" పేరుతో సోషల్ మీడియాలో అకౌంట్ ప్రారంభించడం జరిగిందన్నారు. తక్కువ సమయంలోనే ఆ పార్టీకి కోట్ల సంఖ్యలో యువత మద్దతు తెలపడం దేశంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. ఆ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలో నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో లోపాలు, వైద్య సేవల సమస్యలు, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, పరీక్షల లీకేజీలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వంటి పలు అంశాలను ప్రస్తావించడం జరిగిందన్నారు. దేశంలో ప్రధాన రాజకీయ పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోకపోవడం వల్లే యువత కొత్త ఆలోచనల వైపు మొగ్గుచూపుతోందన్నారు. ప్రజా సమస్యలపై ప్రధాన మీడియా, ఈడీ, సీబీఐ వంటి వ్యవస్థలు కూడా సమర్థవంతంగా పనిచేయడం లేదనే భావన యువతలో పెరుగుతోందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో యువత పెద్ద ఎత్తున ప్రత్యామ్నాయ రాజకీయాలపై ఆసక్తి చూపుతోందన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో ప్రభుత్వం , ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలను విస్మరించారని ఆరోపించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో యువత మద్దతుతో బీఎస్పీ పార్టీ విజయాన్ని సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శంకర్, సుధాకర్, శరత్ పాల్గొన్నారు.

# రాక్ పాయింట్ వద్ద నుంచి యూరియా సప్లై ,ధాన్యం అన్‌లోడింగ్, పనులను వేగవంతం చేయాలి.

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.
పెద్దపల్లి రైల్వే స్టేషన్ లోని యూరియా రాక్ పాయింట్, పెద్దపల్లి మార్కెట్ యార్డ్‌ను పరిశీలించిన కలెక్టర్.**


**జనం వాయిస్, పెద్దపల్లి, మే 22:**
పెద్దపల్లి లోని రైల్వే స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన రాక్ పాయింట్ నుంచి యూరియా సప్లై , స్థానిక వ్యవసాయ మార్కెట్ లోని ధాన్యం అన్‌లోడింగ్, పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం పెద్దపల్లి లోని రైల్వే స్టేషన్ వద్దగల యూరియా రాక్ పాయింట్ ను, వ్యవసాయ మార్కెట్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ...జిల్లాలో వ్యవసాయ అవసరాలకు తగ్గట్టుగా రాక్ పాయింట్ వద్ద ఉన్న యూరియాను లారీలు, హమాలీ కార్మికులను సమకూర్చుకొని త్వరగా జిల్లా వ్యాప్తంగా సప్లై చేయాలని అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొస్తున్న ధాన్యం అన్‌లోడింగ్ పనులను ఎలాంటి ఆలస్యం లేకుండా వెంటనే చేపట్టాలని సూచించారు. లారీల కొరత రాకుండా చూసుకోవడంతో పాటు, పనులకు ఆటంకం కలగకుండా తగినంత మంది హమాలీ కార్మికులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# జీవో 98 రద్దు చేయాలి.

**బలవంతపు సర్వేలు, హక్కుల ఉల్లంఘన ఆపాలి.
ముల్కనూర్ వద్ద మున్నేరు రిజర్వాయర్ నిర్మించాలి.**





vishwa jampala 4:12 PM
to cmo, prlsecy-sr-cm, r...

From vishwa jampala • vishwajampala@gmail.com
To cmo@telangana.gov.in
prlsecy-sr-cm@telangana.gov.in
rajbhavan-hyd@gov.in
cs@telangana.gov.in
Date May 22, 2026, 4:12 PM
View security details

*మున్నేరు-పాలేరు లింక్ కెనాల్ రద్దుకై సమగ్ర ప్రజా నివేదిక*
తేది: 22 మే, 2026
గార్ల , మహబూబాబాద్ జిల్లా

గౌరవ శ్రీ శివప్రతాప్ శుక్లా గారు,
రాష్ట్ర గవర్నర్ గారు, తెలంగాణ రాష్ట్రం.

గౌరవ శ్రీ ఎ. రేవంత్ రెడ్డి గారు,
ముఖ్యమంత్రి, తెలంగాణ ప్రభుత్వం.

గౌరవ శ్రీ కె. రామకృష్ణారావు గారు ,
ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ప్రభుత్వం.

**గార్ల /జనం వాయిస్ :**
మండల పరిధిలో ప్రతిపాదించిన మున్నేరు- పాలేరు లింక్ కెనాల్, జీవో 98 ప్రాజెక్టును తక్షణమే రద్దు చేయాలని పర్యావరణ, సాంస్కృతిక, సామాజిక- ఆర్థిక,భూ వినాశనం, గిరిజన హక్కుల ఉల్లంఘనలపై న్యాయవాది, తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు విశ్వ జంపాల గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు లకు సమగ్ర ప్రజా నివేదికను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముల్కనూరు దుబ్బ గూడెం గ్రామాల వద్ద ఉన్న మున్నేరు నది చెక్ డ్యామ్ నుండి ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ కు నీటిని మళ్లించేందుకు ప్రతిపాదించిన 9.6 కిలోమీటర్ల మున్నేరు పాలేరు లింక్ కెనాల్ నిర్మాణం వల్ల గార్ల మండలానికి గాని, మహబూబాబాద్ జిల్లాకు గాని పైసా ప్రయోజనం లేదని అన్నారు. మండల పరిధిలోని జల వనరులను సహజ సంపదను దోచుకుని ఇతర ప్రాంతాలకు తరలించే ఏకపక్ష ప్రాజెక్టు మాత్రమే అన్నారు. స్థానిక ప్రజల త్యాగాలపై నిర్మించే ఈ కాలువ వల్ల ఇక్కడి రైతులకు ఒక్క ఎకరానికి కూడా సాగునీరు అందకపోగా ఉన్న వనరులు కూడా హరించుకుపోతాయని ఆవేదన వ్యక్తం చేశారు.మున్నేరు నది నుంచి నీటిని పూర్తిగా మళ్ళించడం వలన మండలంలో భూగర్భ జలమట్టం పడిపోతుందని తెలిపారు. ప్రస్తుతం బావులు, బోరు బావుల పై ఆధారపడి సాగు అవుతున్న వేలాది ఎకరాలు ఎడారిగా మారుతాయని అన్నారు.మున్నేరు పరివాహక ప్రాంతంలోని జీవవైవిద్యం, వన్యప్రాణులు, పక్షుల ఆవాసాలు, జలచరాలు ఈ కృత్రిమ కాలువ తవ్వకం, నీటి మళ్లింపు వలన అంతరించిపోయే ప్రమాదం ఉందని తెలిపారు.తరతరాలుగా ప్రశాంతంగా జీవిస్తున్న గిరిజన పల్లెలు, తండాలు ఈ ప్రాజెక్టు వల్ల మొక్కలు అవుతాయని, సామాజిక బంధాలు తెగిపోయి కుటుంబాలు చెల్లాచెదురు అవుతాయి అన్నారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ భారీ పోలీసు బలగాల పహారాలో, తుపాకుల నీడలో సర్వేలను జరుపుతున్నారని అన్నారు.కేవలం రూ 162 కోట్ల ప్రాజెక్టును స్థానికులకు ఎలాంటి మేలు జరగని కాలువ కోసం ఏకంగా రు. 204 కోట్లకు పెంచడం వెనక కాంట్రాక్టర్ల ప్రయోజనాలు, భారీ అవినీతి దాగి ఉందనేది స్పష్టంగా అర్థమవుతుంది అన్నారు.మున్నేరు పాలేరు ప్రాజెక్టు వలన గార్ల మండలానికి వచ్చే లాభం సున్న, కానీ జరిగే నష్టం అనంతం. పర్యావరణం, సంస్కృతి, జీవనోపాధి, రాజ్యాంగ హక్కులన్నింటిని సమాధి చేసే ఈ ప్రాజెక్టును ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.మున్నేరు జలాలను తరలించే కుట్రను విరమించుకొని స్థానిక 60 వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం ముల్కనూరు వద్దే మున్నేరు రిజర్వాయర్ నిర్మించి స్థానిక గిరిజన, గిరిజనేతర రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు.

# ప్రభుత్వ బడిలోనే పిల్లలను చేర్పించాలి:
# వార్డు సభ్యుడు మేకల అక్షయ్ కుమార్

**చింతగూడ గ్రామంలో ఉత్సాహంగా 'జయశంకర్ బడిబాట'.
ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు.**

**జనం వాయిస్ మంచిర్యాల, మే 22:**
జన్నారం మండలంలోని చింతగూడ గ్రామంలో "జయశంకర్ బడిబాట" కార్యక్రమం శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమైంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచడమే లక్ష్యంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

**ఇంటింటికీ వెళ్లి అవగాహన:**
ఈ సందర్భంగా రెండవ వార్డు సభ్యుడు మేకల అక్షయ్ కుమార్ బడిబాటలో పాల్గొని, గ్రామంలోని ఇళ్లను సందర్శించారు. తల్లిదండ్రులతో మాట్లాడి, తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించి ఆర్థికంగా నష్టపోవద్దని, అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఆయన కోరారు.

**ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య:**
ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ లలిత, ఉపాధ్యాయుడు సురేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం కల్పిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత వసతుల గురించి వారు గ్రామస్తులకు వివరించారు. బడిబాట ద్వారా విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు, అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు.




# భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్

**జనం వాయిస్, జమ్మికుంట, మే 22:**
తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్న భాగ్యరెడ్డి వర్మ జయంతి వేడుకలలో మున్సిపల్ కార్యాలయంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ దళిత వైతాళికుడుగా ప్రసిద్ధి చెందిన భాగ్యరెడ్డి వర్మ (మే 22,1888 – ఫిబ్రవరి 18, 1939) సంఘ సంస్కర్త, ఆది ఆంధ్ర సభ స్థాపకుడు. 1906–1933 మధ్య హైదరాబాద్ సంస్థానంలో 26 దళిత బాలికల పాఠశాలలను స్థాపించి, వారి అభ్యున్నతికి గట్టి పునాదులు వేశాడు. జగన్మిత్రమండలి, మన్యసంఘం, సంఘసంస్కార నాటకమండలి,అహింసా సమాజంలను స్థాపించి హైదరాబాదు ప్రాంతంలో సంఘసంస్కరణలకై కృషిచేశాడు అలాంటి మహనీయుని జయంతిని అధికారికంగా జరుపుకోవడం సంతోషకరమని తెలుపుతూ ఇలా జయంతిని వర్ధంతిలు జరుపుకోవడమే కాకుండా యువత వారి ఆశయాల్లో ముందుకుసాగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి కౌన్సిలర్స్ కొలుగురి సురేష్, కూతడి తిరుపతి, శీలం శ్రీనివాస్, చందా రాజు, మేనేజర్ జి రాజిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, RI భాస్కర్, వాణి మరియు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆపదలో అండగా సమ్మి గౌడ్ ఫౌండేషన్

**ఫోటోగ్రాఫర్ కర్ణాకర్ కుటుంబానికి 100 కిలోల బియ్యం సహాయం.**



**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
కేసముద్రం మున్సిపాలిటీ పరిధిలోని అమీనాపురం ఎస్సీ కాలనీకి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ ఇనుముల కర్ణాకర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. కొద్ది రోజుల క్రితం బ్రెయిన్‌లో నరాలు చిట్లి రక్తస్రావం కావడంతో ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య సుజాత, కుమారుడు షాన్, కుమార్తె రక్షిత ఉన్నారు. కర్ణాకర్ మృతి విషయం తెలుసుకున్న సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య వెంటనే స్పందించి మృతుడి కుటుంబ సభ్యులను స్వయంగా పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫోటోగ్రాఫర్‌గా ఎన్నో సంవత్సరాలుగా ప్రజల జీవితాల్లోని మధుర జ్ఞాపకాలను తన కెమెరాలో బంధించిన కర్ణాకర్ మరణం బాధాకరమన్నారు. మంచి మనసున్న వ్యక్తిని కోల్పోవడం సమాజానికి తీరని లోటని పేర్కొన్నారు. సమ్మి గౌడ్ ఫౌండేషన్ ఎల్లప్పుడూ ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామిగా ఉంటుందని, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. మృతుడి కుటుంబానికి ధైర్యం చెబుతూ ఫౌండేషన్ తరఫున తక్షణ సహాయంగా ఒక క్వింటాల్ బియ్యాన్ని అందజేశారు. భవిష్యత్‌లో కర్ణాకర్ పిల్లల చదువులకు కూడా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెంకట్ కన్నా, దండు శ్రీను, కేసముద్రం ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ, సొంత మనుషులే పట్టించుకోని ఈ రోజుల్లో సమ్మన్న వంటి వారు బాధిత కుటుంబాలకు అండగా నిలవడం గొప్ప విషయమన్నారు. విషయం తెలియగానే వెంటనే స్పందించి సహాయం చేసిన సమ్మి గౌడ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండు శ్రీను, కళ్లెం శ్రీను, జన్ను కట్టయ్య, చంటి, శరత్, భాస్కర్, శ్యామ్, అనిల్, కృష్ణ, రాజేందర్ కుమార్, అభిలాష్, సుశీల, యాకమ్మ, స్వర్ణలత, రమ, సరిత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం అమ్మకానికి వచ్చిన రైతులకు అండగా ఉంటాం

**- మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్.**

**జనం వాయిస్, జమ్మికుంట, మే 22:**
జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం చల్లగరిగ కు చెందినటువంటి రైతులు IKP సెంటర్లో వారిధన్యం కొనుగోలు చేయక ఇబ్బందులు పడుతూ మూడురోజుల నుండి జమ్మికుంటకు ధాన్యం అమ్మకానికి తీసుకువచ్చారని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ స్థానిక శాసన సభ్యులు పాడి కౌశిక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి స్థానిక మిల్లర్లు తో మట్లాడుతామని తెలుపుతూ అక్కడ ఉన్నటువంటి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ మీ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులకు అన్నివిధాలుగా అండగా ఉండాల్సిన మీరు మీ ప్రభుత్వం కనీసం ఐకెపి సెంటర్లు పరిశీలించకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఇకనైనా మీరు మేల్కొని రైతులకు సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ తదితరులు పాల్గొన్నారు.




# సమగ్ర సర్వే 'తప్పుల' శాపం..!

- పథకాలకు దూరమవుతున్న పేదలు.
- ఆధార్, రేషన్ కార్డుల్లో ఒకలా.. సర్వేలో మరోలా పేర్లు.
- పూరి గుడిసెలున్నా పక్కా ఇళ్లున్నట్లు రికార్డుల్లో నమోదు.
- వెరిఫికేషన్‌లో లబ్ధిదారులపై అనర్హత వేటు.., పేదల ఆవేదన.
- మహబూబాబాద్ జిల్లా కురవి మండలం చింతపల్లిలో వెలుగుచూసిన వైనం.
- సర్వే రికార్డుల సవరణకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు చేయాలని వేడుకోలు.

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
తెలంగాణ ప్రభుత్వం 2014లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 'సమగ్ర కుటుంబ సర్వే' (SKS) లో దొర్లిన క్షేత్రస్థాయి లోపాలు ఇప్పుడు పేద ప్రజల పాలిట శాపంగా మారాయి. దశాబ్దం క్రితం నాటి సర్వే అధికారులు చేసిన నిర్వాకం, నమోదు చేసిన తప్పుల వల్ల నేడు అర్హులైన లబ్ధిదారులు ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు వంటి సంక్షేమ పథకాలను పొందలేక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. మహబూబాబాద్ జిల్లా ఉమ్మడి కురవి మండలంలోని చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో గల కొత్తతండా ఇందుకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది.

**రికార్డుల్లో ఇష్టారాజ్యం.. పేర్లు, ఇంటి పేర్లు మాయం!**
నాడు సర్వే నిర్వహించిన అధికారులు కనీస నిబంధనలు పాటించకుండా, లబ్ధిదారుల ఆధార్ కార్డులు, ఓటర్ ఐడీలు, రేషన్ కార్డుల్లో ఉన్న అసలు పేర్లను పరిశీలించకుండా ఇష్టారాజ్యంగా వివరాలు నమోదు చేశారు. అనేక కుటుంబాల ఇంటి పేర్లు, ఇంటి యజమాని పేర్లు, కుటుంబ సభ్యుల పేర్లను తప్పులతడకగా మార్చేశారు. కేవలం అక్షరదోషాలే కాకుండా, లబ్ధిదారుల నివాస అర్హతలను కూడా తలకిందులు చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు పూరి గుడిసెల్లో నివసిస్తుంటే.. వారికి పక్కా గృహాలు ఉన్నట్లు, గత ప్రభుత్వాల్లోనే ఇందిరమ్మ ఇళ్లు పొందినట్లు రికార్డుల్లో నమోదు చేయడం గమనార్హం.


**కొత్తతండాలో వెలుగుచూసిన దారుణం.., 'తేజవత్' కాస్త 'లూనవత్' అయింది!**
చింతపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తతండాకు చెందిన తేజవత్ సెలా (భర్త వర్జన్) అనే నిరుపేద మహిళకు ఆధార్, ఓటర్



ఐడీ, రేషన్ కార్డులలో స్పష్టంగా 'తేజవత్' అనే ఇంటి పేరు ఉంది. కానీ నాటి సమగ్ర కుటుంబ సర్వేలో అధికారులు ఆమె ఇంటి పేరును 'లూనవత్ సెలా'గా నమోదు చేశారు. అంతటితో ఆగకుండా, ఆమె ప్రస్తుతం నివాసం ఉంటున్న పూరి గుడిసెను చూసి కూడా, గతంలోనే ఇందిరమ్మ గృహం పొందినట్లు సర్వే రికార్డుల్లో తప్పుగా నమోదు చేశారు. అధికారులు చేసిన ఈ రెండు తప్పులు ఇప్పుడు ఆ కుటుంబానికి పెద్ద శాపంగా మారాయి.

**వెరిఫికేషన్ ఫామ్‌లతో అర్హులకు అన్యాయం :**
ప్రస్తుత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఇందిరమ్మ గృహాలు, వివిధ రకాల పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎంతో ఆశతో దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఈ పథకాల అర్హతలను తేల్చడానికి ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే (SKS) డేటాను ముడిపెట్టింది. క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్న అధికారులు ఆన్‌లైన్ వెరిఫికేషన్ ఫామ్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నారు. తేజవత్ సెలా ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకోగా, వెరిఫికేషన్ ఫామ్‌లో "గతంలోనే ఇందిరమ్మ ఇల్లు పొంది ఉన్నారు" అని పాత సర్వే డేటా చూపిస్తుండటంతో అధికారులు ఆమెను నేరుగా అనర్హురాలిగా ప్రకటిస్తున్నారు. అటు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే, ఆమె రేషన్ కార్డులోని పేరుకు, సర్వే ఫామ్‌లోని ఇంటి పేరుకు (తేజవత్ - లూనవత్) పొంతన లేదనే సాకుతో పింఛన్‌ను సైతం తిరస్కరిస్తున్నారు.

**సర్వే రికార్డుల సవరణకు ప్రత్యేక గ్రీవెన్స్ :**
అవసరంసమగ్ర కుటుంబ సర్వేలో జరిగిన తప్పుల కారణంగా కేవలం చింతపల్లి గ్రామమే కాకుండా జిల్లా వ్యాప్తంగా వందలాది కుటుంబాలు నష్టపోతున్నాయి. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులు ఎదుర్కొంటున్న ఈ ప్రధాన సమస్యలపై జిల్లా యంత్రాంగం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వం స్పందించి డేటా సవరణ కోసం ప్రత్యేక గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయాలని, పాత సర్వేను పక్కనపెట్టి ప్రస్తుత ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల ఆధారంగా



నిజా నిజాలు పరిశీలించి ఇందిరమ్మ గృహం, పింఛన్ మంజూరు చేయాలని చింతపల్లి గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల తప్పునకు మేం బలికావాలా? బాధితురాలు తేజవత్ సెలా.**



"మేము దశాబ్దాలుగా పూరి గుడిసెలోనే దీనంగా జీవితం వెళ్లదీస్తున్నాం. నాడు సర్వే చేయడానికి వచ్చిన అధికారులు ఏసీ గదుల్లో కూర్చొని తప్పులు రాస్తే దానికి ఇప్పుడు మేం ఎలా బాధ్యుల మవుతాం? అధికారుల తప్పుల వల్ల మాకు రావాల్సిన ఇల్లు, పింఛన్ రాకుండా పోయాయి" అని బాధితురాలు తేజవత్ సెలా కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సమగ్ర కుటుంబ సర్వేలోని సాంకేతిక లోపాలను సరిచేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పాత సర్వేను పక్కనపెట్టి, ప్రస్తుత ఆధార్, ఓటర్, రేషన్ కార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో నిజానిజాలు పరిశీలించి ఇందిరమ్మ గృహం, పింఛన్ మంజూరు చేయాలని చింతపల్లి గ్రామస్తులు వేడుకుంటున్నారు.

# 24 గంటల్లోనే కేసును చేదించిన పోలీసులు

- దారి దోపిడికి పాల్పడిన ఎనిమిది మంది అరెస్ట్.
- పరారీలో మరో ముగ్గురు గాలిస్తున్న పోలీసులు.



**జనం వాయిస్, జమ్మికుంట, మే 22:**
జమ్మికుంట పాత మున్సిపాలిటీ సమీపంలో ఎడ్లను కొనుగోలు చేసి వస్తున్న ఇద్దరు వ్యక్తులపై 11 మంది దాడి చేసి నగదు తో పాటు బంగారం దోచుకుపోయిన సంఘటనలో 8 మందిని పోలీసులు అరెస్టు చేశారు.జమ్మికుంట పట్టణంలోని పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హుజురాబాద్ ఏసిపి మాధవి తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 20న 11 మంది గుర్తి తెలియని వ్యక్తులు పాత మున్సిపాలిటీ కార్యాలయం వద్ద అశోక్ లేలాండ్ బడా దోస్తు వాహనం ను అడ్డగించి అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులపై దాడి చేశారు. అనంతరం వారిని ఎఫ్సీఐ గోదాం సమీపంలోని కాళీ స్థలానికి తీసుకొని వెళ్లి నగదు బంగారు ఉంగరము తోపాటు ఫోన్ పే ద్వారా 38 రూపాయలను బలవంతంగావసూలుచేశారు.అంతేకాకుండా వారిని మరింతగా బలవంతం చేసి లక్ష రూపాయలు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొని వచ్చారని ఈ క్రమంలో వారు గట్టిగా అరవడంతో నిందితులుఅక్కడినుంచిపారిపోయినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనపై పోలీసులు గురువారం సైదాబాద్ ఎక్స్ రోడ్ వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో ఎనిమిది మంది అనుమానాస్పదంగా కనబడడంతో వారిని పట్టుకున్నారు. విచారణలో నేరం చేసినట్లు అంగీకరించడంతో పల్లెపు ఈశ్వర్, పల్లెకు అశోక్, ఎలకపల్లి ప్రమోద్, చొక్కారపు అఖిలేష్, మొగ్గుల్లా రాకేష్, పల్లపు మహేష్, పల్లపు మహేష్ ,తప్పేలవంశీ లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 14 వేల రూపాయల నగదు తో పాటు అర్రతులం బంగారు ఉంగరం నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎసిపి మాధవి పేర్కొన్నారు. తప్పించుకుని తిరుగుతున్న మరో ముగ్గురిపై గాలింపు చర్యలు చేపట్టడం జరుగుతుందని వారిని కూడా త్వరలోనే అదుపులోకి తీసుకుంటామని పేర్కొన్నారు.

# పాకాల కొత్తగూడా సభకు గ్రామ గ్రామాన ఆదివాసి పోరుకేక

**46 డిగ్రీల ఎండలోనూ డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ ప్రచార యాత్ర.**

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
గంగారం మండలం కామారం గ్రామంలో ఆదివాసి ఉద్యమ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో ఆహ్వానిస్తూ డోలు వాయిద్యాల మధ్య భారీ ర్యాలీ నిర్వహించారు. "మేము సైతం చలో కొత్తగూడా" అంటూ గ్రామ ప్రజలు నినాదాలు చేశారు. 46 డిగ్రీల తీవ్ర ఎండలను కూడా లెక్కచేయకుండా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉద్యమానికి మద్దతుగా ముందుకు రావడం విశేషంగా నిలిచింది. చేతుల్లో కర్రలు పట్టుకుని ఆదివాసి అస్తిత్వ పరిరక్షణ కోసం పోరాటంలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నామని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ మాట్లాడుతూ, "ఎస్టీ జాబితా నుంచి లంబాడాలను తొలగించే వరకు నా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. జూన్ 3న జరిగే పాకాల కొత్తగూడా "ఆదివాసి పోరు కేక" భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని గ్రామ గ్రామాన ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పగిడిద్దరాజు సన్నిధి నుంచి ప్రారంభమైన ద్విచక్ర వాహన ర్యాలీలో యువత భారీగా పాల్గొంది. గూడెం గూడెం తిరుగుతూ ఆదిమ తెగల అస్తిత్వ పరిరక్షణ కోసం ప్రజలను ఏకం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. తీవ్ర ఎండల కారణంగా అనారోగ్యానికి గురైనప్పటికీ పోరాటం ఆపేది లేదని స్పష్టం చేశారు. జూన్ 3న జరిగే సభకు రెండు ట్రాక్టర్లు, 30 బైకులతో హాజరవుతామని కామారం గ్రామ ప్రజలు శపథం చేశారు. ఆదివాసి యువకులు, నిరుద్యోగులు తమ గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించి కొత్తగూడా సభకు భారీగా తరలిరావాలని డాక్టర్ అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు.





# ప్రజాప్రతినిధుల మాటలు ప్రకటనలకేనా..?

- ధాన్యం కటింగ్ పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.
- ప్రభుత్వ తీరు పై ముత్తారం మాజీ సింగిల్విండో ఛైర్మన్ గుజ్జుల రాజరెడ్డి ఆగ్రహం.



**జనం వాయిస్, ముత్తారం, మే 22:**
పెద్దపల్లి జిల్లా అంతటా ధాన్యం గింజ కటింగ్ లేకుండా చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని ప్రజాప్రతినిధులు ప్రకటనలు చేస్తుంటే ముత్తారం మండలం లోని రైతులను కటింగ్ పేరుతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ముత్తారం మండల మాజీ సింగల్ విండో చైర్మెన్ గుజ్జుల రాజిరెడ్డి శుక్రవారం ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు ఎంఎల్ఎ లు రైతులు పండించిన వరి ధాన్యాన్ని కటింగ్ లేకుండా చివరి గింజవరకు కొనుగోలు చేస్తామని చెపుతుంటే ముత్తారం మండలం లోని కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసాక లోడు తో వెళ్ళిన లారీ లు మిల్లుల వద్ద దించు కోవడానికి ఎందుకు జాప్యం జరుగుతుందని ప్రశ్నించారు. కటింగ్ పేరుతో రైతులను నట్టేట ముంచుతున్నారని కొనుగోలు కేంద్రాలలో వరి ధాన్యం నిల్వలు ఎక్కడి వక్కడే ఉన్నాయని ఆరోపించారు. కటింగ్ లేకుండా తూకం వేసి రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని ఎడల బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతుల పక్షాన ఆందోళన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు.

# అడవిశ్రీరాంపూర్ లో అగ్ని ప్రమాదం.

- తగలబడిన గడ్డి వాములు.
- సర్పంచ్, స్థానికుల చొరవతో తప్పిన ముప్పు.



**జనం వాయిస్, ముత్తారం, మే 22:**
ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామం లో పలు ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ప్రమాదవశాత్తు గడ్డి వాములకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. గమనించిన స్థానికులు, గ్రామ సర్పంచ్ తక్షణమే స్పందించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో తృటిలో పెద్ద ప్రమాదం తప్పింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో క్షణాల వ్యవధిలోనే మంటలు చుట్టుపక్కల ఉన్న మరికొన్ని గడ్డి వాములకు వేగంగా వ్యాపించాయి. చాలా మంది రైతుల మోటార్ స్టార్టర్ పెట్టెలు మరియు పైపులు దగ్ధం అయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్థుల సహకారంతో సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. ఎండలు మండిపోతున్న ఈ తరుణంలో గడ్డి వాములు, పంట పొలాల వద్ద రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. సకాలంలో స్పందించి ప్రమాదాన్ని అదుపు చేసిన స్థానికులను మరియు ఫైర్ సిబ్బందిని గ్రామ ప్రజలు అభినందించారు.



# మృతుడు కుటుంబానికి ఆత్మీయ స్వచ్ఛంద సంస్థ బియ్యం, నగదు అందజేత...!

**మే 22 జనం వాయిస్, పాలకుర్తి:**
జనగామ జిల్లా: పాలకుర్తి మండలం ఇరవెన్ను గ్రామానికి చెందిన, శంకర్ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి "ఆత్మీయ స్వచ్ఛంద సేవా సంస్థ"ఆధ్వర్యంలో 50ఎస్త్ర ల బియ్యం, రెండువేల నగదు, నూనె అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు బిర్రు సోమేశ్వర్, ముస్కు కేశవరావు, అనంతుల పురుషోత్తం, అనుముల మహేందర్, తోడుసు మల్లేష్, యార రాజు, ఏదునూరి మదార్, జక్కుల రాజు , బిర్రు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



దినపత్రిక జనం వాయిస్ తెలుగు దినపత్రిక
RNI NO:TGTEL/26/A0383
WWW.JANAMVOICE.COM

# మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

## జిల్లా ఎస్పీ డా. శబరీష్




**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశించారు. శుక్రవారం మహబూబాబాద్ పట్టణ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ జిల్లా పరిధిలోని పోలీస్ అధికారులతో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ జిల్లాలో గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. గంజాయి విక్రయాలు, రవాణా, వినియోగంపై కఠిన నిఘా కొనసాగించాలని సూచించారు. హోటళ్లు, లాడ్జిలు, అనుమానాస్పద ప్రాంతాల్లో తరచూ తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. నకిలీ విత్తనాలు (రాజూబతీఅశీబం ావవసం), నకిలీ ఎరువులు విక్రయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి పూట పటిష్టమైన నైట్ పట్రోలింగ్ నిర్వహించాలని, ప్రతి పట్రోలింగ్ అధికారి తప్పనిసరిగా పాయింట్ బుక్స్‌ను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. పట్రోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. పెండింగ్ కేసులు, అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై అధికారులను ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. కేసుల దర్యాప్తు వేగవంతంగా పూర్తి చేసి నేరస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మత సామరస్యాన్ని కాపాడే విధంగా అప్రమత్తంగా ఉండాలని, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, వదంతులు వ్యాప్తి చెందకుండా కఠిన నిఘా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించి అసత్య సమాచారాన్ని నమ్మవద్దని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ప్రజల్లో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం కల్పించాలని తెలిపారు. ప్రజలను సరైన మార్గంలో నడిపించే బాధ్యత పోలీసులపై ఉందని, ప్రతి పోలీస్ అధికారి ప్రజలకు ఆదర్శంగా ఉండే విధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ సూచించారు. జిల్లాలో ప్రజల విశ్వాసాన్ని మరింత పెంచే విధంగా క్రమశిక్షణ, బాధ్యతతో పని చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో సంతోషంగా ఉండాలి.

## అడవిశ్రీరాంపూర్ ఉపసర్పంచ్ అనవేన హరిత తిరుపతి.
## గౌడ సంఘం ఆధ్వర్యంలో ఉపసర్పంచ్ దంపతులకు సన్మానం.

**జనం వాయిస్, ముత్తారం, మే 22:**
ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ అనవేన హరిత తిరుపతి ని ఘనంగా సన్మానించారు. గౌడ సంఘం ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ దంపతులకి శాలువా కప్పి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం గౌడ కులదైవమైన శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి చిత్రపటాన్ని వారికి బహుకరించి ప్రత్యేక గౌరవాన్ని చాటుకున్నారు. ఆ ఎల్లమ్మ తల్లి దేవి కృపాకటాక్షాలతో వారు వారి కుటుంబం ఎల్లప్పుడూ ఆయురారోగ్యాలతో చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో వారు మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని, ప్రజలకు మరింత సేవ చేయాలని వారు కోరుకున్నారు సన్మానం అనంతరం ఉపసర్పంచ్ మాట్లాడుతూ గౌడ సంఘం సభ్యులు తనపై చూపించిన ప్రేమాభిమానాలకు సన్మానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు, గ్రామ ప్రజల సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో మరింత ముందుకు తీసుకెళ్తానని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘ పెద్దలు కూనూరి సత్యనారాయణ బోనగాని రాజమొగిలి గట్టు రమేశ్ రంగు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# సరిహద్దులు దాటుతున్న రేషన్ దందా.

**బయ్యారం /జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలంలో రేషన్ దందా సరిహద్దులు దాటుతున్న చూసిచుడనట్లు వ్యవహారిస్తున్న అధికారులు. ఏజెన్సీ పల్లెప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. ఇదేమని అడుగుతున్న వారిని లెక్కచేయకుండా తమకు అధికారుల అండదండలు ఉన్నాయంటూ జోరుగా అక్రమ రేషన్ బియ్యం సరిహద్దులు దాటిస్తున్నారు.ద్విచక్ర వాహనాలమీద ఒక చోటికి తరలించుకుంటూ బొలెరో వాహనాలలో బస్తాలతో నింపుకొని యదేచ్ఛగా తరలించుకుపోతున్నారు. అక్రమ రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యాపారస్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు, ప్రజా సంఘాల నాయకులు కోరుతున్నారు.




# మత్తు పదార్థాల నిర్మూలనకు తొర్రూర్‌లో ప్రత్యేక తనిఖీలు

## నార్కోటిక్స్ జాగిలం "మ్యాక్స్"తో ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాలు, పాన్ షాపులు, కిరాణా దుకాణాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు.

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణంలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఆదేశాల మేరకు శుక్రవారం తొర్రూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ తనిఖీలు చేపట్టారు. నార్కోటిక్స్ జాగిలం "మ్యాక్స్", డాగ్ హ్యాండ్లర్ శివరాజ్ సహాయంతో తొర్రూర్ ఎస్ఐ అంజలి, పోలీస్ సిబ్బంది కలిసి ట్రాన్స్‌పోర్ట్ కేంద్రాలు, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. మత్తు పదార్థాల అమ్మకం, కొనుగోలు, రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. పాన్ షాపులు, కిరాణా దుకాణాల యజమానులకు 18 సంవత్సరాల లోపు పిల్లలకు గుట్కా, టొబాకో ఉత్పత్తులు, సిగరెట్లు, ఇతర మత్తు పదార్థాలు విక్రయించరాదని స్పష్టమైన సూచనలు ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా. శబరీష్ మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వ్యసనం వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబాలు, సమాజంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు కొనసాగిస్తోందని తెలిపారు. అలాగే ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద వ్యక్తులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలు లేదా మత్తు పదార్థాల అక్రమ రవాణాపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు.



# హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల ఎంపిక

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
సంచాలకులు గిరిజన సంక్షేమ శాఖ, హైదరాబాద్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ రామంతపూర్/బేగంపేట్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి ఒకటవ తరగతి ప్రవేశాల కోసం మహబూబాబాద్ జిల్లా స్థాయి ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ఈ ప్రవేశాలకు సంబంధించి గతంలో ఐటిడిఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ అధికారి పత్రికా ప్రకటన విడుదల చేయగా, మొత్తం 34 మంది గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు ఉప సంచాలకులు (గిరిజన సంక్షేమం) కార్యాలయం వెల్లడించింది. జిల్లాకు కేటాయించిన ఆరు సీట్లలో కోయ ఉపకులానికి కేటాయించిన రెండు సీట్లకు కేవలం ఒక బాలుడు మాత్రమే దరఖాస్తు చేసుకోగా, బాలికల నుంచి ఎలాంటి దరఖాస్తులు రాలేదు. దీంతో నిబంధనల ప్రకారం ఐదుగురు విద్యార్థులను జిల్లా స్థాయి కమిటీ లాటరీ పద్ధతిలో ఎంపిక చేసింది. ఎంపికైన వారిలో నలుగురు లంబాడ ఉపకులానికి, ఒకరు కోయ ఉపకులానికి చెందిన వారు ఉన్నారు. వీరిలో ఇద్దరు బాలికలు, ముగ్గురు బాలురకు అవకాశం కల్పించారు. ఈ ఎంపిక ప్రక్రియను శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ప్రాజెక్ట్ అధికారి ఐటిడిఏ ఏటూరునాగారం ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా స్థాయి కమిటీ సభ్యులుగా ఉప సంచాలకులు దేశిరాం, జిల్లా విద్యాశాఖ అధికారి, ప్యానల్ గ్రేడ్ ప్రధానోపాధ్యాయులు వి. సారంగపాణి, డి. కోటేశ్వరి, బి. సక్రు పాల్గొన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల సమక్షంలో లాటరీ విధానంలో ఎంపిక నిర్వహించినట్లు ఉప సంచాలకులు దేశిరాం తెలిపారు.

**ఎంపికైన విద్యార్థుల వివరాలు ఇలా ఉన్నాయి:**
ఆమ్గోత్ చేతన్ తండ్రి చందూలాల్, దుండ తండ, ఉగ్గంపల్లి, చిన్నగూడూరు మండలం, బోడ అధ్విక్ తండ్రి రఘు, లచ్చిరం తండ, కురవి మండలం, భుక్య గ్యనేశ్వరి తండ్రి చందూలాల్, పకీరతండ, నరసింహులపేట మండలం, సాయిశరణ్య తండ్రి నరేష్, బీచురాజుపల్లి, మరిపెడ మండలం, తాటి హర్షవర్ధన్ తండ్రి రాంబాబు, గూడూరు గ్రామం, గూడూరు మండలం, మహబూబాబాద్ జిల్లా అధికారులు ప్రకటించారు.



# కేసముద్రంలో "అక్షయ డిజిటల్ స్టూడియో" ప్రారంభం

**మహబూబాబాద్ / జనం వాయిస్:**
కేసముద్రం మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన "అక్షయ డిజిటల్ స్టూడియో"ను గోపా డివిజన్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు, కౌన్సిలర్ వీరేష్ కలిసి శుక్రవారం ప్రారంభించారు. పూజా కార్యక్రమాల నడుమ జరిగిన ఈ ప్రారంభోత్సవానికి స్థానిక ప్రజలు, యువత పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి రంగంలో ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధునిక డిజిటల్ సేవలు అందుబాటులోకి రావడం అభివృద్ధికి సంకేతమని పేర్కొన్నారు. స్టూడియో యజమాని వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామల నర్సయ్య, తీగల వెంకటేశ్వర్లు, స్థానిక పాస్టర్లు, కుటుంబ సభ్యులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



# వరి కోత మిషన్‌లో పడి చనిపోయిన కొండచిలువ.

**జనం వాయిస్. అక్కన్నపేట మండల్. మే.22:**
సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం మల్ చెరువుతండాలోని ఓ వరి పొలంలో కొండచిలువ ప్రత్యక్షమైంది. వరి కోత మిషన్‌తో కోతలు నిర్వహిస్తుండగా కొండచిలువ మిషన్‌లో పడి చనిపోయింది. రైతు బానోతు అనిల్‌కు చెందిన పొలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. చనిపోయిన కొండచిలువను చూసేందుకు చుట్టుపక్కల రైతులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకుని ఆసక్తిగా పరిశీలించారు. తండా పరిసర ప్రాంతాల్లో కొండచిలువలు కనిపించడం సాధారణ విషయమేనని స్థానికులు తెలిపారు.



# శ్రీవాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట వద్ద మైనింగ్ అనుమతులు వెంటనే రద్దు చేయాలి.

## డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్.

**మే 22 జనం వాయిస్, పాలకుర్తి:**
జనగామ జిల్లా: దేవరుప్పుల మండలం లకవత్ తండా పంచాయతీ పరిధిలోని వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట ప్రాంతంలో మైనింగ్ కార్యకలాపాలకు అనుమతులు మంజూరు చేయడం పట్ల స్థానిక ప్రజల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. మైనింగ్ పనుల వల్ల ఆ ప్రాంతంలోని పర్యావరణ సమతుల్యత దెబ్బతినే ప్రమాదం ఉండటమే కాకుండా, పరిసర గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ తెలిపారు. ముఖ్యంగా గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఉనికి, ఆధ్యాత్మిక ప్రాముఖ్యతకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు కొండపై ఉన్న సహజ వనరులపై ఆధారపడి వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని, మైనింగ్ కార్యకలాపాల వల్ల భూగర్భ జలాలు, పంట భూములు మరియు ప్రకృతి వనరులు దెబ్బతిని రైతులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల మనోభావాలు, పర్యావరణ పరిరక్షణ, దేవాలయ పరిరక్షణ మరియు రైతుల జీవనాధారాన్ని దృష్టిలో ఉంచుకొని వాన కొండయ్య లక్ష్మీనరసింహస్వామి గుట్ట వద్ద మైనింగ్ అనుమతులను వెంటనే రద్దు చేసి, ఆ ప్రాంతాన్ని పరిరక్షించాలని జిల్లా కలెక్టర్‌ను డీసీసీ అధ్యక్షురాలు ధన్వంతి లక్ష్మీనారాయణ లకావత్ కోరారు. ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండలానికి చెందిన లకవత్ తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు బొడా యాకన్న, మూడో వార్డు సభ్యురాలు లకవత్ వెన్నెల (భర్త: సుధాకర్), పొట్టిగుట్ట తండా గ్రామ సర్పంచ్ అనిత (భర్త: చందులాల్), ధరవతే తండా గ్రామ సర్పంచ్ అనిత (భర్త: రవీందర్), నల్లకుంట తండా గ్రామ పార్టీ అధ్యక్షుడు భాస్కర్, సర్పంచ్‌లు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# వడదెబ్బకు వ్యక్తి మృతి

## రెండు రోజుల తర్వాత వెలుగులోకి వచ్చిన మృతదేహం

**మహబూబాబాద్ / జనం వాయిస్ :**
మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం తహసీల్దార్ బంజర గ్రామంలో విషాద ఘటన చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన నన్నే బోయిన సత్యం వడదెబ్బకు గురై మృతి చెందినట్లు స్థానికులు అనుమానిస్తున్నారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఈ ఘటన రెండు రోజుల పాటు బయటకు రాలేదు. ఇంటి వెనకాల నుంచి తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం చెందిన గ్రామస్తులు వెళ్లి చూడగా, సత్యం మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించింది. దీంతో గ్రామంలో ఒక్కసారిగా కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇటీవల జిల్లాలో పెరుగుతున్న ఎండలు, వేడి గాలుల తీవ్రత ప్రజలను భయాందోళనకు గురిచేస్తుండగా, అవసరం లేకుండా ఎండలో తిరగవద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.



# చిగురుమామిడిలో ఆకట్టుకున్న బ్రహ్మంగారి నాటక ప్రదర్శన..

**జనం వాయిస్, చిగురుమామిడి, మే.22:**
/చిగురుమామిడి:చిగురుమామిడి రాజన్నపల్లె శ్రీనాగరాజేశ్వరస్వామి ఆలయం వద్ద జగద్గురు,కాలజ్ఞానకర్త శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి జీవిత చరిత్ర నాటక ప్రదర్శన రెండు రోజులుగా అంగరంగ వైభవంగా ప్రదర్శింపబడుతుంది.ఈ కార్యక్రమ మొదటి రోజు గ్రామ సర్పంచ్ ఆకవరం భవాని శివప్రసాద్,సీతారాంపూర్ సర్పంచ్ గోగురు లక్ష్మి మురాహరిరెడ్డి,ఉపసర్పంచ్ కాశవేని విజయ రాజు,వార్డు మెంబర్లు పోతర్ల శివాంజనేయులు, పోతరవేని అనిల్ ఆలయ చైర్మన్ గడ్డం రామ్ రెడ్డి, సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు వలాస సుభాష్ ఎస్ బి ఎన్ ఛానల్ ప్రతినిధి సొన్నాయిలా భరత్,నల్లవెల్లి సమ్మయ్యలు హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో స్వామివారి జన్మ రహస్యం,తల్లికి జ్ఞానోపదేశం చేయడం, అచ్చమాంబ వద్ద గోవుల కాయుట,కడప నవాబుకు,ఆనంద భైరవునికి, అన్నాజెయునికి కాలజ్ఞానం చెప్పుట, కాపులకు జ్ఞానోపదేశం చేయుట,పోలేరమ్మతో నిప్పు తెప్పించుట తదితర సన్నివేశాలు ప్రదర్శించారు విస్డం చారిటబుల్ ట్రస్ట్,ఎస్ బి ఎన్ ఛానల్ ఆధ్వర్యంలో కళాకారులకు ప్రశంస పత్రాలు అందజేశారు.ఇందులో కళాకారులు చిగురుమామిడి కళాకారుల కమిటీ మండల అధ్యక్షుడు శ్రీరామోజు రాజకుమార్, కుతాడి కొమురయ్య, నిలిగొండ సదానందం, చందబోయిన పరశు రాములు, నిలిగొండ కిషన్, పోలోజు కుమార్ స్వామి, అనువోజు శ్రీనివాస్, పోలోజు రమేష్, విశ్వనాథం సత్తయ్య, చొప్పదండి సుధాకర్, మల్లం బాలయ్య, మల్లం శ్రీనివాస్,లోకిని పోచయ్య, అన్వోజు వెంకటాద్రి,నిలిగొండ విష్ణువర్ధని, ముసాపూరి సంపత్ తోపాటు గాగిరెడ్డిపల్లి, ఇందుర్తి, లంబాడిపల్లె, సీతారాంపూర్,సుందరగిరి,రేకొండ,చిగురుమామిడి నవాబుపేట్ గ్రామాల కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# ఇంటిని పరిమళాలతో నింపే సుగంధ మొక్కలు



- సహజ సువాసనతో ఆరోగ్యానికి మేలు.
- రూమ్ ఫ్రెష్నర్లకు బదులుగా మొక్కల వైపు మొగ్గు.
- ఇంటి అందం, ప్రశాంతతను పెంచుతున్న పచ్చదనం.



**జనం వాయిస్, డెస్క్, మే 22:**

ఇంట్లోకి అడుగుపెట్టగానే తేలికపాటి మంచి వాసన వస్తే మనసుకే ఒక ప్రత్యేకమైన ప్రశాంతత కలుగుతుంది. రోజంతా పని ఒత్తిడితో అలసిపోయి ఇంటికి చేరుకున్నప్పుడు చల్లటి గాలి, సహజమైన పరిమళం ఉంటే మానసికంగా కూడా ఎంతో రిలాక్స్‌గా అనిపిస్తుంది. అందుకే ప్రస్తుతం చాలా మంది ఇంట్లో సహజ సువాసనలు ఇచ్చే మొక్కలను పెంచేందుకు ఆసక్తి చూపుతున్నారు. మార్కెట్‌లో దొరికే రూమ్ ఫ్రెష్నర్లు, కెమికల్ స్ప్రేలు కొంతసేపు మాత్రమే వాసన ఇస్తే, మొక్కలు మాత్రం రోజంతా సహజమైన పరిమళాన్ని పంచుతాయి. అంతేకాదు గాలిని శుభ్రపరచడం, ఇంటి అందాన్ని పెంచడం, ప్రశాంత వాతావరణాన్ని సృష్టించడం వంటి అనేక ప్రయోజనాలు కూడా అందిస్తాయి. సుగంధ మొక్కలలో ముందుగా చెప్పుకోవాల్సింది జాస్మిన్ మొక్క గురించే. మల్లెపూల పరిమళం చాలా మందికి ఇష్టమైనది. సాయంత్రం వేళల్లో ఈ మొక్క నుంచి వచ్చే వాసన ఇంటంతా వ్యాపించి ఎంతో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగిస్తుంది. బాల్కనీ, కిటికీ పక్కన లేదా ఇంటి ముందుభాగంలో ఈ మొక్కను పెంచితే గాలి ద్వారా పరిమళం ప్రతి మూలకు చేరుతుంది. ముఖ్యంగా వేసవికాలంలో రాత్రివేళల్లో మల్లెపూల వాసన మరింత ఎక్కువగా ఉంటుంది. చాలామంది ఇంటి వద్ద చిన్న మల్లె తీగను పెంచుకుని సహజ సువాసనను ఆస్వాదిస్తున్నారు. అలాగే రోజా మొక్క కూడా ఇంటి అందాన్ని పెంచే ముఖ్యమైన మొక్కల్లో ఒకటి. ఎరుపు, గులాబీ, తెలుపు రంగుల్లో ఉండే రోజాలు చూడటానికే కాదు, వాటి పరిమళంతో కూడా ఆకట్టుకుంటాయి. ఉదయం వేళల్లో వికసించే రోజా పూల వాసన ఇంటి వాతావరణాన్ని తాజాగా ఉంచుతుంది. కొంతమంది చిన్న గార్డెన్‌లలో లేదా కుండీల్లో రోజా మొక్కలను పెంచుతున్నారు. సరైన ఎండ, నీరు అందితే ఈ మొక్కలు ఎక్కువకాలం పూలు ఇస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఆరోగ్యపరంగా ప్రయోజనాలు ఇచ్చే మొక్కల్లో తులసి మొక్క ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. భారతీయ ఇళ్లలో తులసి మొక్కను పవిత్రంగా భావిస్తారు. ఈ మొక్క నుంచి వచ్చే తేలికపాటి వాసన గాలిని తాజాగా ఉంచడంలో సహాయపడుతుంది. తులసి ఆకుల్లో ఉండే సహజ గుణాలు గాలి నాణ్యతను మెరుగుపరుస్తాయని నిపుణులు చెబుతున్నారు. ఉదయం సమయంలో తులసి దగ్గర గడిపితే మానసిక ప్రశాంతత కూడా కలుగుతుందని చాలామంది విశ్వసిస్తున్నారు. ఇక లెమన్ గ్రాస్ ప్రస్తుతం చాలా ఇళ్లలో కనిపిస్తున్న మరో ప్రత్యేక మొక్క. దీని నుంచి వచ్చే నిమ్మ వాసనలాంటి సువాసన ఇంటిని తాజాగా ఉంచుతుంది. వర్షాకాలంలో వచ్చే దుర్వాసనలను తగ్గించడంలో కూడా ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. కొంతమంది లెమన్ గ్రాస్ ఆకులతో టీ కూడా తయారు చేసుకుంటున్నారు. ఈ మొక్కను పెంచడం చాలా సులభం కావడంతో పట్టణ ప్రాంతాల్లో కూడా దీనికి మంచి ఆదరణ పెరుగుతోంది. ప్రశాంతమైన వాతావరణాన్ని కోరుకునే వారు లావెండర్ మొక్క వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. ఈ మొక్క నుంచి వచ్చే మృదువైన వాసన ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. బెడ్‌రూమ్ లేదా చదివే గదిలో ఈ మొక్కను ఉంచితే ప్రశాంతమైన అనుభూతి కలుగుతుందని అంటున్నారు. విదేశీ దేశాల్లో లావెండర్ మొక్కలను అలంకరణ కోసం కూడా విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. అదేవిధంగా మింట్ మొక్క కూడా ఇంట్లో పెంచేందుకు అనువైన మొక్కగా గుర్తింపు పొందుతోంది. మింట్ ఆకులను తాకగానే వచ్చే చల్లటి వాసన ఎంతో ఫ్రెష్‌గా అనిపిస్తుంది. కిచెన్ దగ్గర లేదా కిటికీ పక్కన ఈ మొక్కను పెంచితే మంచి వాతావరణం ఏర్పడుతుంది. మింట్ ఆకులను వంటల్లో కూడా ఉపయోగించవచ్చు. నిపుణుల అభిప్రాయం ప్రకారం సుగంధ మొక్కలను పెంచేటప్పుడు తగిన సూర్యరశ్మి, నీరు, గాలి అందేలా చూసుకోవాలి. ప్రతి రోజు కొంతసేపు మొక్కల దగ్గర గడపడం వల్ల మానసిక ప్రశాంతత పెరుగుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం నగర జీవనంలో ఒత్తిడి ఎక్కువవుతున్న నేపథ్యంలో చాలా మంది ఇంట్లో చిన్న పచ్చదనాన్ని పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. సహజ పరిమళాలు ఇచ్చే మొక్కలు ఇంటిని అందంగా మార్చడమే కాకుండా ఆరోగ్యానికి కూడా ఉపయోగపడుతున్నాయని నిపుణులు సూచిస్తున్నారు.



## పిల్లలకు ఆకలి పెరగాలంటే.. ఇంట్లోనే ఈ మార్పులు చాలు

పిల్లలు సరిగ్గా తినడం లేదని చాలా మంది తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే మార్కెట్లో దొరికే సిరప్స్, టానిక్స్ కొనిపెడుతున్నారు. కానీ వైద్య నిపుణులు మాత్రం పిల్లలకు ఆకలి పెరగాలంటే ముందుగా వారి రోజువారీ అలవాట్లలో మార్పులు తీసుకురావాలని సూచిస్తున్నారు. సహజమైన పద్ధతులు పాటిస్తే పిల్లల్లో ఆకలి మెల్లగా పెరుగుతుందని చెబుతున్నారు. రోజంతా టీవీ, మొబైల్ ఫోన్లతో గడిపే పిల్లల్లో ఆకలి తగ్గిపోతుందని నిపుణులు చెబుతున్నారు. బయట పరుగులు పెట్టడం, సైకిల్ తొక్కడం, ఆటలు ఆడటం వల్ల శరీరం శక్తిని ఎక్కువగా ఖర్చు చేస్తుంది. దీంతో సహజంగానే ఆకలి పెరుగుతుంది. ప్రతి రోజు కనీసం గంటసేపు బయట ఆడే అలవాటు ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. చాలా ఇళ్లలో పిల్లలు ఏడిస్తే వెంటనే బిస్కెట్లు, చిప్స్, చాక్లెట్లు ఇస్తుంటారు. ఇవి కడుపు నింపేస్తాయి కానీ శరీరానికి సరైన పోషకాలు ఇవ్వవు. ఫలితంగా భోజనం చేసే సమయానికి ఆకలి ఉండదు. అందుకే జంక్ ఫుడ్ తగ్గించి గుడ్లు, పప్పులు, పెరుగు, పండ్లు, కూరగాయలు ఎక్కువగా ఇవ్వాలని నిపుణులు సూచిస్తున్నారు. భోజనం సమయానికి పెట్టడం కూడా చాలా ముఖ్యం. ప్రతిరోజూ ఒకే సమయానికి తినే అలవాటు ఉంటే శరీరం ఆ సమయానికే ఆకలి సంకేతాలు పంపుతుంది. అలాగే పిల్లలను బలవంతంగా తినిపించకూడదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అలా చేస్తే భోజనం పట్ల భయం పెరిగే అవకాశం ఉంటుందని చెబుతున్నారు. ఇంకా మంచి నిద్ర కూడా పిల్లల ఆకలిపై ప్రభావం చూపుతుంది. రాత్రిళ్లు ఆలస్యంగా నిద్రపోయే పిల్లల్లో ఆకలి తగ్గే అవకాశం ఉంటుంది. అందుకే వయస్సుకు తగ్గట్టు సరైన నిద్ర ఉండేలా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు. సహజమైన అలవాట్లు పెంచితే సిరప్స్ అవసరం లేకుండానే పిల్లలు ఆరోగ్యంగా తింటారని వైద్యులు చెబుతున్నారు.



- బయట ఆటలు పెరిగితేనే సహజంగా ఆకలి.
- జంక్ ఫుడ్ తగ్గిస్తే భోజనం మీద ఆసక్తి.
- నిద్ర, సమయపాలన కూడా చాలా ముఖ్యం.

## ముఖానికి మునగాకు పొడి. సహజ అందానికి అద్భుత చిట్కా

- చర్మానికి పోషణ అందించే మునగాకు.
- మొటిమలు, మచ్చలు తగ్గించడంలో సహాయం.
- ఇంట్లోనే సులభంగా తయారు చేసుకునే ఫేస్‌ప్యాక్‌లు.








**జనం వాయిస్, డెస్క్, మే 22:**

ఆరోగ్యానికి మునగాకు ఎంత మేలు చేస్తుందో అందరికీ తెలిసిందే. అయితే అదే మునగాకు పొడిని ముఖానికి ఉపయోగించడం వల్ల చర్మానికి కూడా అనేక ప్రయోజనాలు కలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. సహజ పోషకాలతో నిండిన మునగాకు పొడిలో విటమిన్ ఏ, సి, ఈలు సమృద్ధిగా ఉండటంతో చర్మాన్ని కాంతివంతంగా మార్చడంలో ఇది సహాయపడుతుంది. మునగాకు పొడిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని దెబ్బతీసే కాలుష్యం ప్రభావాన్ని తగ్గించడంలో ఉపయోగపడతాయి. మొటిమలు, నల్ల మచ్చలు తగ్గేందుకు ఇది సహాయపడుతుందని చెబుతున్నారు. చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించి ముఖాన్ని తాజాగా కనిపించేలా చేస్తుంది. పొడి

చర్మం ఉన్నవారు మునగాకు పొడిలో తేనె, పెరుగు కలిపి ఫేస్‌ప్యాక్‌గా వాడితే చర్మానికి తేమ అందుతుంది. జిడ్డు చర్మం ఉన్నవారు గులాబీ నీరు కలిపి ఉపయోగిస్తే ముఖంపై అదనపు నూనె తగ్గుతుందని చెబుతున్నారు. వారానికి రెండు సార్లు ఇలా వాడితే మంచి ఫలితాలు కనిపించే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. మునగాకు పొడిని ఉపయోగించే ముందు ముఖాన్ని శుభ్రంగా కడుక్కోవాలి. తర్వాత ప్యాక్‌ను పలుచగా రాసి పదిహేను నిమిషాల పాటు ఉంచాలి. అనంతరం చల్లని నీటితో కడిగితే చర్మం తాజాగా మారుతుంది. అయితే సున్నితమైన చర్మం ఉన్నవారు ముందుగా చేతిపై కొద్దిగా పరీక్షించి వాడడం మంచిదని సూచిస్తున్నారు. రసాయన పదార్థాలున్న సౌందర్య ఉత్పత్తుల కంటే సహజ పద్ధతులను ఎన్నుకునేవారిలో మునగాకు పొడి వినియోగం పెరుగుతోంది. సరైన పద్ధతిలో వాడితే చర్మానికి సహజ కాంతి తీసుకురావడంలో ఇది ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.



దినమిక్ జనం వాయిస్ తెలుగు దినపత్రిక WWW.JANAMVOICE.COM RNI NO:TGTEL/26/A0383





# ప్యారడైజ్ బిర్యానీ విస్తరణకు భారీ ప్రణాళిక

ప్రముఖ ఆహార బ్రాండ్ ప్యారడైజ్ బిర్యానీ దేశవ్యాప్తంగా తన వ్యాపారాన్ని మరింత విస్తరించేందుకు భారీ ప్రణాళికలు సిద్ధం చేసింది. వచ్చే మూడు సంవత్సరాల్లో దేశంలోని పలు ప్రధాన నగరాల్లో మరో వంద కొత్త అవుట్‌లెట్లను ప్రారంభించనున్నట్లు సంస్థ యాజమాన్యం ప్రకటించింది. ప్రస్తుతం హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, చెన్నై నగరాల్లో కలిపి మొత్తం 57 అవుట్‌లెట్లు నిర్వహిస్తున్న సంస్థ, ఇకపై దేశవ్యాప్తంగా తన ఉనికిని మరింత బలపర్చాలని లక్ష్యంగా పెట్టుకుంది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, ముఖ్య కార్యనిర్వాహణ అధికారి అభిక్ మిత్రా మాట్లాడుతూ, రాబోయే కాలంలో బెంగళూరు, చెన్నైతో పాటు కోల్‌కతా, పుణె, న్యూఢిల్లీ, ముంబై వంటి ప్రధాన నగరాల్లో కూడా ప్యారడైజ్ బిర్యానీ అవుట్‌లెట్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ విస్తరణ కోసం సుమారు రూ.100 కోట్ల వరకు పెట్టుబడులు పెట్టనున్నట్లు వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థ టర్నోవర్ రూ.280 కోట్లుగా నమోదైందని, కొత్త అవుట్‌లెట్లు ప్రారంభం అనంతరం వచ్చే మూడు సంవత్సరాల్లో అది రూ.500 కోట్లకు చేరుకుంటుందని కంపెనీ ఆశాభావం వ్యక్తం చేసింది. ప్యారడైజ్ బిర్యానీలో వంద శాతం వాటా కలిగిన పెట్టుబడి సంస్థ సమారా క్యాపిటల్ ఈ విస్తరణకు అవసరమైన నిధులను సమకూర్చనున్నట్లు తెలిపారు. హైదరాబాద్ బిర్యానీకి దేశవ్యాప్తంగా ఉన్న ప్రత్యేక గుర్తింపును మరింత విస్తరించాలనే లక్ష్యంతో సంస్థ ఈ అడుగులు వేస్తోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. కొత్త నగరాల్లో కూడా స్థానిక రుచులకు అనుగుణంగా సేవలను విస్తరించే దిశగా కంపెనీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# అరబిందో ఫార్మాకు లాభాల జోష్

దేశీయ ప్రముఖ ఔషధ తయారీ సంస్థ అరబిందో ఫార్మా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నాలుగో త్రైమాసిక ఫలితాల్లో ఆశాజనక ప్రదర్శన కనబరిచింది. మార్చితో ముగిసిన మూడు నెలల కాలానికి కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం రూ.920.84 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.902.83 కోట్ల లాభంతో పోలిస్తే ఈసారి సుమారు రెండు శాతం వృద్ధి నమోదైంది. కంపెనీ తన ఆర్థిక ఫలితాలను బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు వెల్లడించింది. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఆదాయం రూ.8,853.34 కోట్లకు పెరిగినట్లు తెలిపింది. అంతర్జాతీయ మార్కెట్లలో ఔషధాల అమ్మకాలు పెరగడం, కీలక విభాగాల్లో స్థిరమైన డిమాండ్ కొనసాగడం కంపెనీ ఆదాయ వృద్ధికి దోహదపడినట్లు తెలుస్తోంది. అదే సమయంలో నిర్వహణ వ్యయాలు కూడా పెరిగాయి. సమీక్షా కాలంలో కంపెనీ మొత్తం ఖర్చులు రూ.7,677.34 కోట్లకు చేరుకున్నాయి. ముడి పదార్థాల ధరలు, తయారీ వ్యయాలు, సరఫరా సంబంధిత ఖర్చులు పెరగడం ఇందుకు ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు. అయితే పెరిగిన ఖర్చుల మధ్య కూడా సంస్థ లాభదాయకతను కొనసాగించడం పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతోంది. ఔషధ రంగంలో గ్లోబల్ మార్కెట్లపై మరింత దృష్టి సారిస్తూ అరబిందో ఫార్మా తన వ్యాపార విస్తరణను కొనసాగిస్తున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.




# ఐపీఓకు జెప్టో సిద్ధం

దేశంలో వేగంగా ఎదుగుతున్న క్విక్ కామర్స్ రంగానికి చెందిన ప్రముఖ స్టార్టప్ జెప్టో త్వరలో భారతీయ స్టాక్ మార్కెట్లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. ప్రారంభ పబ్లిక్ ఆఫర్ ద్వారా సుమారు రూ.11 వేల కోట్ల నిధులను సమీకరించాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ ఐపీఓ విజయవంతమైతే ఇప్పటికే మార్కెట్లో నమోదైన జొమాటో, స్విగ్గీ సరసన జెప్టో కూడా చేరనుంది. సమాచారం ప్రకారం పబ్లిక్ ఆఫర్‌కు అవసరమైన అనుమతులను కంపెనీ ఇప్పటికే భారతీయ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నుంచి పొందినట్లు తెలుస్తోంది. అలాగే అప్‌డేటెడ్ డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్‌ను కూడా దాఖలు చేసినట్లు సమాచారం. జూలై 31లోపు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ ప్రక్రియను పూర్తి చేయాలని కంపెనీ యాజమాన్యం భావిస్తున్నట్లు మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. క్విక్ కామర్స్ రంగంలో జెప్టో వ్యూహం ఇతర కంపెనీలతో పోలిస్తే భిన్నంగా ఉందని ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ బెర్న్‌స్టీన్ విశ్లేషించింది. ప్రస్తుతం జెప్టో దేశవ్యాప్తంగా 61 నగరాల్లో 1,255 డార్క్ స్టోర్లను నిర్వహిస్తోంది. ఒక్కో నగరంలో సగటున 21 స్టోర్ల సాంద్రత కలిగి ఉండటం సంస్థ ప్రత్యేకతగా మారింది. పోటీ సంస్థలు సగటున తొమ్మిది స్టోర్ల వరకే




పరిమితమవుతున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. యువ పారిశ్రామికవేత్తలు ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా స్థాపించిన ఈ సంస్థ మొదట 'కిరాణాకార్ట్' పేరుతో కార్యకలాపాలు ప్రారంభించింది. ప్రారంభ దశలో 45 నిమిషాల్లో సరుకుల డెలివరీ లక్ష్యంగా పనిచేసిన సంస్థ, తర్వాత సొంత డార్క్ స్టోర్ల మోడల్‌ను అభివృద్ధి చేసి కేవలం 10 నిమిషాల్లోనే సరుకుల డెలివరీ చేసే సేవలను ప్రారంభించింది. వేగవంతమైన సేవలను ప్రధాన బలంగా మార్చుకుని సంస్థ 'జెప్టో'గా పేరు మార్చుకుంది. భారతదేశంలో ఆన్‌లైన్ గ్రోసరీ, తక్షణ డెలివరీ సేవల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో జెప్టో ఐపీఓ మార్కెట్లో మంచి ఆసక్తిని రేకెత్తించే అవకాశాలు కనిపిస్తున్నాయని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# తగ్గిన బంగారం ధరలు.. మళ్లీ పెరిగిన వెండి

గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతున్న బంగారం ధరలు నేడు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయితే వెండి ధరలు మాత్రం మరోసారి భారీగా పెరిగాయి. దేశవ్యాప్తంగా ఆభరణాల కొనుగోలుదారులు, పెట్టుబడిదారులు మార్కెట్ ధరలపై ఆసక్తిగా గమనిస్తున్నారు. హైదరాబాద్‌లో నేడు ఉదయం 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.440 తగ్గి రూ.1,59,490కు చేరుకుంది. అలాగే 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.400 తగ్గి రూ.1,46,200 వద్ద కొనసాగుతోంది. మరోవైపు వెండి ధర మాత్రం భారీగా పెరిగింది. కిలో వెండి ధర ఒక్కరోజులోనే రూ.5 వేల మేర ఎగబాకి రూ.2.95 లక్షలకు చేరుకుంది. విజయవాడ మార్కెట్‌లో కూడా దాదాపు ఇదే స్థాయి ధరలు నమోదయ్యాయి. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరల్లో స్వల్ప మార్పులు కనిపించాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,240గా ఉండగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,47,800 వద్ద కొనసాగుతోంది. ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,59,490గా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,200గా ఉంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,59,640గా ఉండగా, 22 క్యారెట్ల ధర రూ.1,46,250 వద్ద కొనసాగుతోంది. వెండి ధరలు దేశవ్యాప్తంగా మరింత బలంగా కొనసాగుతున్నాయి. పలు నగరాల్లో కిలో వెండి ధర రూ.2.85 లక్షల నుంచి రూ.2.95 లక్షల మధ్య ట్రేడ్ అవుతోంది. అంతర్జాతీయ మార్కెట్ ప్రభావం, డిమాండ్ పెరగడం, డాలర్ మారకపు విలువల మార్పులు వంటి అంశాలు ధరలపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు.




# ప్లేఆఫ్స్ కోసం ఉత్కంఠ

ఐపీఎల్ 2026 లీగ్ దశ ముగింపు దశకు చేరుకోవడంతో ప్లేఆఫ్స్ సమీకరణాలు ఆసక్తికరంగా మారాయి. గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నైపై గుజరాత్ ఘన విజయం సాధించడంతో పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో ఒకదాన్ని ఖరారు చేసుకుంది. ప్రస్తుతం బెంగళూరు, గుజరాత్, హైదరాబాద్ జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించగా.. చివరి స్థానానికి రాజస్థాన్, పంజాబ్, కోల్‌కతా జట్లు పోటీపడుతున్నాయి. ప్రస్తుతం బెంగళూరు, గుజరాత్ జట్లు 18 పాయింట్లతో ఉండగా.. హైదరాబాద్ 16 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతోంది. మిగిలిన జట్లు ఈ పాయింట్లను అందుకునే అవకాశం లేకపోవడంతో తొలి మూడు స్థానాలు ఈ జట్లకే ఖరారయ్యాయి. అయితే తొలి రెండు స్థానాల కోసం బెంగళూరు, హైదరాబాద్ మధ్య గట్టి పోటీ నెలకొంది. నేడు హైదరాబాద్ వేదికగా బెంగళూరు, హైదరాబాద్ జట్లు తలపడనున్నాయి. ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు తొలి రెండు స్థానాల్లోకి చేరాలంటే భారీ విజయం సాధించాల్సి ఉంటుంది. ముందుగా బ్యాటింగ్ చేస్తే కనీసం 87 పరుగుల తేడాతో గెలవాలి. ఒకవేళ లక్ష్య ఛేదనకు దిగితే 11 ఓవర్లలోపే విజయాన్ని అందుకోవాలి. అప్పుడు మాత్రమే రన్‌రేట్ పరంగా హైదరాబాద్‌కు లాభం చేకూరుతుంది. లేదంటే మూడో స్థానంతో సరిపెట్టుకోవాల్సి ఉంటుంది. ఇక నాలుగో ప్లేఆఫ్స్ స్థానం కోసం రాజస్థాన్, పంజాబ్, కోల్‌కతా జట్ల మధ్య పోటీ కొనసాగుతోంది. ముంబైతో జరిగే మ్యాచ్‌లో రాజస్థాన్ గెలిస్తే నేరుగా తదుపరి దశకు చేరుకుంటుంది. ఓడిపోతే మాత్రం ఇతర జట్ల ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. పంజాబ్ లక్నో చేతిలో ఓడిపోవాలి. అలాగే కోల్‌కతా ఢిల్లీ చేతిలో పరాజయం చెందాలి. ఈ రెండు ఫలితాలు అనుకూలిస్తేనే రాజస్థాన్‌కు అవకాశం ఉంటుంది. పంజాబ్ జట్టు ప్లేఆఫ్స్ చేరాలంటే లక్నోపై గెలవడంతో పాటు ముంబై చేతిలో రాజస్థాన్ ఓడిపోవాలి. అలాగే కోల్‌కతాపై ఢిల్లీ విజయం సాధించాలి. ఇక కోల్‌కతా ఆశలు సజీవంగా ఉండాలంటే పంజాబ్ ఓడిపోవాలి. రాజస్థాన్ కూడా పరాజయం చెందాలి. అదేవిధంగా ఢిల్లీపై భారీ తేడాతో విజయం సాధించాల్సి ఉంటుంది. రన్‌రేట్ కూడా కీలకంగా మారింది. పంజాబ్ రన్‌రేట్ ప్రస్తుతం మెరుగ్గా ఉండగా.. కోల్‌కతా పెద్ద తేడాతో గెలిస్తేనే ముందంజలోకి వచ్చే అవకాశం ఉంటుంది. మరోవైపు ఢిల్లీ రన్‌రేట్ చాలా దారుణంగా ఉండటంతో ఆ జట్టుకు అవకాశాలు పూర్తిగా ముగిశాయి. గురువారం నాటి పరాజయంతో చెన్నై కూడా టోర్నీ నుంచి నిష్క్రమించింది.





# గైక్వాడ్‌కు భారీ జరిమానా.. చెన్నై ప్లేఆఫ్స్ ఆశలకు ముగింపు

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు ఐపీఎల్ నిర్వాహకులు భారీ జరిమానా విధించారు. గుజరాత్ టైటాన్స్‌తో గురువారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై జట్టు నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోవడంతో స్లో ఓవర్ రేట్ నేరం కింద ఈ చర్యలు తీసుకున్నారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం ఇది చెన్నై జట్టుకు రెండో తప్పిదంగా పరిగణించబడింది. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌పై రూ.24 లక్షల జరిమానా విధించినట్లు ఐపీఎల్ అధికారిక ప్రకటనలో తెలిపింది. అలాగే జట్టులోని మిగతా ఆటగాళ్లు, ఇంపాక్ట్ ప్లేయర్‌పై కూడా రూ.6 లక్షలు లేదా మ్యాచ్ ఫీజులో 25 శాతం కోత విధించనున్నట్లు వెల్లడించింది. ఇక మ్యాచ్ విషయానికి వస్తే, ఐదుసార్లు ఛాంపియన్‌గా నిలిచిన చెన్నై సూపర్ కింగ్స్‌కు ఈ సీజన్ నిరాశాజనకంగా ముగిసింది. గుజరాత్ టైటాన్స్ చేతిలో 89 పరుగుల భారీ తేడాతో ఓటమిపాలైన చెన్నై ప్లేఆఫ్స్ ఆశలను పూర్తిగా కోల్పోయింది. లీగ్ దశలోనే టోర్నీ నుంచి నిష్క్రమించాల్సి వచ్చింది. ముందుగా బ్యాటింగ్ చేసిన గుజరాత్ టైటాన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 229 పరుగుల భారీ స్కోరు చేసింది. సాయి సుదర్శన్ 84 పరుగులతో అద్భుత ఇన్నింగ్స్ ఆడగా, కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 64 పరుగులతో జట్టుకు బలమైన ఆరంభం అందించాడు. చివర్లో జోస్ బట్లర్ 57 పరుగులతో మెరిపించాడు. అనంతరం భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై జట్టు గుజరాత్ బౌలర్ల ధాటికి కుప్పకూలింది. మహ్మద్ సిరాజ్, కగిసో రబాడ, రషీద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌తో చెన్నై బ్యాటింగ్‌ను చీల్చిచెండాడారు. శివం దూబే 47 పరుగులతో కొంత పోరాడినప్పటికీ, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. చెన్నై జట్టు కేవలం 13.4 ఓవర్లలోనే 140 పరుగులకు ఆలౌటైంది. ఈ విజయంతో గుజరాత్ టైటాన్స్ పాయింట్ల పట్టికలో రెండో స్థానాన్ని మరింత బలపరుచుకోగా, ప్లేఆఫ్స్‌కు ముందే తమ జోరును తిరిగి అందుకుంది. అద్భుత బౌలింగ్ ప్రదర్శన చేసిన మహ్మద్ సిరాజ్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

## రాజాసాబ్ హీరోయిన్ హల్‌చల్



దక్షిణాది చిత్రసీమలో తన అందం, నటనతో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మాళవిక మోహనన్ ప్రస్తుతం సినీ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారుతున్నారు. వరుస భారీ చిత్రాల్లో అవకాశాలు దక్కించుకుంటూ స్టార్ హీరోయిన్‌గా దూసుకుపోతున్న ఆమె, ఇప్పుడు ప్రభాస్ నటిస్తున్న భారీ చిత్రం 'ది రాజా సాబ్' ద్వారా తెలుగు ప్రేక్షకుల ముందుకు రానుండటంతో మరింత చర్చనీయాంశంగా నిలిచారు. 1993 ఆగస్టు 4న కేరళలోని కన్నూర్‌లో జన్మించిన మాళవిక, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.యు. మోహనన్ కుమార్తె. మలయాళ హీరో దుల్కర్ సల్మాన్ సరసన 'పట్టం పోల్' చిత్రంతో ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు. ఆ తర్వాత హిందీలో ప్రముఖ దర్శకుడు మజీద్ మజీదీ తెరకెక్కించిన 'బియాండ్ ది క్లౌడ్స్' చిత్రంలో నటించి విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు. తమిళ చిత్రసీమలో మాత్రం మాళవిక కెరీర్‌కు భారీ మలుపు తిరిగింది. సూపర్ స్టార్ రజనీకాంత్‌తో 'పెట్టా', స్టార్ హీరో విజయ్‌తో 'మాస్టర్' చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు సంపాదించారు. ఆ తర్వాత 'తంగలాన్', 'యుద్ధ', 'హృదయపూర్వం' వంటి చిత్రాలతో తన నటనకు మరింత ప్రశంసలు అందుకున్నారు. ఇప్పుడు ప్రభాస్ హీరోగా తెరకెక్కుతున్న 'ది రాజా సాబ్' చిత్రంలో నటించడం ద్వారా మాళవిక టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. ఈ సినిమా విడుదలకు ముందే ఆమె పాత్రపై అభిమానుల్లో భారీ ఆసక్తి నెలకొంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉంటే, మాళవిక చేతిలో ప్రస్తుతం మరిన్ని భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. కార్తి సరసన నటించిన 'సర్దార్ 2', దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న 'పాకెట్ నవల' చిత్రాలు కూడా త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. విభిన్న భాషల్లో నటిస్తూ, తన స్క్రీన్ ప్రెజెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న మాళవిక మోహనన్ దక్షిణాది సినీ పరిశ్రమలో స్టార్ హీరోయిన్‌గా మరింత బలమైన స్థానం సంపాదించుకుంటున్నారు.

## 'పెద్ది' పాట ప్రోమోకు భారీ స్పందన

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా తెరకెక్కుతున్న భారీ చిత్రం 'పెద్ది'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న ఈ క్రీడా ప్రధాన కథా చిత్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలను చిత్రబృందం మరింత వేగవంతం చేసింది. రేపు భోపాల్‌లో భారీ స్థాయిలో సంగీత వేడుక నిర్వహించనున్న నేపథ్యంలో చిత్రబృందం అభిమానులకు ప్రత్యేక సర్‌ప్రైజ్ ఇచ్చింది. సినిమాలోని ప్రత్యేక గీతం "హెల్లల్లలో" పాటకు సంబంధించిన ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమోలో రామ్ చరణ్, శృతి హాసన్ వేసిన ఉత్సాహభరితమైన స్టెప్పులు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. విడుదలైన కొద్ది సేపటికే ఈ ప్రోమో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పూర్తి పాటను మార్చి 23న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ ప్రత్యేక గీతానికి ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ సాహిత్యం అందించగా, ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏ.ఆర్. రెహమాన్ సంగీతాన్ని సమకూర్చారు. రెహమాన్ సంగీతం అంటేనే ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన ఆసక్తి ఉంటుంది. అందులోనూ ఇది ప్రత్యేక గీతం కావడంతో ఈ పాటపై భారీ అంచనాలు నెలకొన్నాయి. రేపు జరగనున్న సంగీత వేడుకలో ఈ పాటను అధికారికంగా విడుదల చేయనున్నారు. ఇక ఈ పాటలో మరో కథానాయిక కూడా కనిపించనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. అయితే ఆమె ఎవరు అన్న విషయాన్ని మాత్రం చిత్రబృందం గోప్యంగా ఉంచింది. దీంతో అభిమానుల్లో ఆసక్తి, ఉత్కంఠ మరింత పెరిగింది. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శివరాజ్ కుమార్, జగపతి బాబు, బొమన్ ఇరానీ, దివ్యేందు శర్మ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. వచ్చే ఏడాది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొనగా, ఇప్పుడు "హెల్లల్లలో" పాటతో మరింత చర్చనీయాంశంగా మారింది.



## మూడు సినిమాల నుంచి తప్పించారు..

# అర్ధరాత్రి ఏడ్చేశా: అనసూయ

టెలివిజన్ యాంకర్‌గా కెరీర్ ప్రారంభించి నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న అనసూయ భరద్వాజ్ ప్రస్తుతం తెలుగు సినీ పరిశ్రమలో బిజీ నటిగా కొనసాగుతున్నారు. యాంకర్‌గా ప్రేక్షకుల మనసులు గెలుచుకున్న ఆమె, ఆ తర్వాత సినిమాల్లోనూ తనదైన నటనతో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు. ముఖ్యంగా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న అనసూయ తాజాగా తన కెరీర్ ప్రారంభ దశలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు.

తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అనసూయ.. తన సినీ ప్రయాణంలో విజయాలతో పాటు ఎన్నో నిరాశలు, అవమానాలు కూడా ఎదుర్కొన్నానని తెలిపారు. కెరీర్ ప్రారంభంలో 'క్షణం', 'సోగ్గాడే చిన్నినాయనా' వంటి సినిమాల్లో అవకాశాలు రావడంతో నటిగా గుర్తింపు లభించిందని చెప్పారు. అయితే తన జీవితంలో అసలైన మలుపు మాత్రం 'రంగస్థలం' సినిమాతోనే వచ్చిందని పేర్కొన్నారు. ఆ చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త' పాత్ర ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోవడంతో పాటు నటిగా ఆమెకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చింది. సినిమా భారీ విజయాన్ని సాధించడంతో అనసూయకు వరుస అవకాశాలు రావడం మొదలయ్యాయని తెలిపారు.

అయితే సినీ జీవితంలో విజయాలే కాదు, బాధాకరమైన సంఘటనలు కూడా తనను తీవ్రంగా కలిచివేశాయని అనసూయ వెల్లడించారు. "ఒక సమయంలో మూడు పెద్ద సినిమాల కోసం ముందుగా నన్నే ఎంపిక చేశారు. పాత్రల గురించి మాట్లాడారు. కానీ తర్వాత ఎలాంటి కారణం చెప్పకుండా ఒక్కసారిగా ఆ ప్రాజెక్టుల నుంచి నన్ను తప్పించారు. ఎందుకు తీసేశారు? నేను ఏం తప్పు చేశాను? అనే విషయం కూడా ఎవరూ చెప్పలేదు" అని అన్నారు.

ఆ సంఘటన తనను చాలా తీవ్రంగా బాధించిందని అనసూయ చెప్పారు. "ఆ రోజు నేను పూర్తిగా మానసికంగా కుంగిపోయాను. అర్ధరాత్రి రెండు గంటల సమయంలో నా భర్త దగ్గర కూర్చొని వెక్కి వెక్కి ఏడ్చాను. ఆ బాధను జీర్ణించుకోవడం చాలా కష్టమైంది" అని భావోద్వేగంతో వివరించారు. సినీ పరిశ్రమలో ఇలాంటి పరిస్థితులు సహజమే అయినా, ఆ సమయంలో తాను చాలా బాధపడ్డానని తెలిపారు.

సోషల్ మీడియాలో ఎదురయ్యే ట్రోలింగ్ గురించి కూడా అనసూయ స్పందించారు. "నా వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలపై కూడా కొందరు అనవసరంగా చర్చలు చేస్తుంటారు. నేను అప్పుడప్పుడు డ్రింక్ చేస్తాను. కానీ పరిమితంగానే తీసుకుంటాను. ఆ విషయాన్ని కూడా కొందరు పెద్ద వివాదంలా మార్చి సోషల్ మీడియాలో ట్రోల్ చేశారు" అని చెప్పారు.

అయితే ఇప్పుడు అలాంటి విమర్శలను పెద్దగా పట్టించుకోవడం మానేశానని అనసూయ తెలిపారు. "ఎవరు ఏమనుకున్నా, ఎన్ని ట్రోల్స్ చేసినా చివరికి నేను నా పని చేసుకుంటూ ముందుకు వెళ్తున్నాను. కాలక్రమంలో అలాంటి విషయాలను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నాను" అని ధైర్యంగా చెప్పారు. ప్రస్తుతం అనసూయ వరుస సినిమాలతో బిజీగా ఉండగా, ఆమె నటనకు ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది.




Printed, Published and Owned by **GATTU MAHESH,** Printed at **M R PUBLICATIONS,** # 6-3-1880, Vanasthalipuram, Rangareddy, Telangana, 500070, **EDITOR: GATTU MAHESH, JANAMVOICE PUBLICATIONS, 2-80/A,** VILL: ADAVISRIRAMPUR, MANDAL: MUTHARAM, DIST: PEDDAPALLI, TELANGANA , 505184. **RNI NO: TGTEL/26/A0383,** CELL: 8008398069, MAIL ID: janamvoicedaily@gmail.com